honeybee.org
Vol-14 Issue-2

సంపుటి 14 సంచిక 2 మార్చి - ఏప్రిల్ 2026

# పల్లెసృజన

www.pallesrujana.org

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక





# కథలు, కళలతో సమజంపై అద్భుతమైన ప్రభావం సాధ్యం



కొన్ని సంవత్సరాల క్రితం అడవుల్లో నక్కలు క్రమంగా కనుమరుగవుతున్నాయని గమనించిన రాజు తీవ్రంగా ఆందోళన చెందాడు. ఈ జంతువును రక్షించాలనే సంకల్పంతో, ఆయన తన శాస్త్రవేత్తలను పిలిపించి, నక్కల సంరక్షణకు మార్గాలు కనుగొనమని ఆదేశించాడు. శాస్త్రవేత్తలు అనేక ప్రణాళికలు రూపొందించారు..... రక్షిత ప్రాంతాల ఏర్పాటు, బందీ పెంపకం కార్యక్రమాలు, ఇంకా కొందరు క్లోనింగ్ వంటి ఆధునిక పద్ధతులను కూడా సూచించారు. కొంత కాలం వరకు ఈ ప్రయత్నాలు ఫలితాన్నిచ్చాయి. నక్కల సంఖ్య కొద్దిగా పెరిగింది.

కానీ ఆ విజయం నిలకడగా ఉండలేదు. వేటగాళ్ళు మరింత చురుకుగా మారడంతో, నక్కలు మళ్లీ వేగంగా కనుమరుగు అవడం ప్రారంభమైంది. ఈ పరిణామంతో రాజు తీవ్ర నిరాశకు లోనయ్యాడు.

అప్పుడు ఒక జ్ఞానవంతుడైన సలహాదారుడు "కథకులు మరియు కళాకారుల సహాయాన్ని తీసుకోవాలని" ఒక కొత్త దారిని సూచించాడు.... ఆ ఆలోచన అంగీకరించిన రాజు, సృజనాత్మక వ్యక్తులను ఈ ఉద్యమంలో భాగస్వాములను చేశాడు.

సంగీత కళాకారులు నక్కలపై హృదయాన్ని తాకే పాటలు సృష్టించారు. రచయితలు మనసును ఆకట్టుకునే కథలు వ్రాశారు. ఫొటో గ్రాఫర్లు, చిత్ర నిర్మాతలు నక్కల అందాన్ని వాటి వల్ల అరణ్యాలకు ఉన్న ప్రాముఖ్యతను సజీవంగా చూపించారు. ఈ సృజనాత్మకకృషి ప్రజల హృదయాలను తాకింది.

క్రమంగా ఈ కథలు ప్రజల్లోకి విస్తరించాయి. అవగాహన పెరిగింది. ప్రజలు ఈ ఉద్యమంలో భాగమై నక్కలను రక్షించడానికి ముందుకు వచ్చారు. వేట తగ్గింది. నక్కల సంఖ్య మళ్ళీ పెరిగింది. చివరికి అడవుల్లో సహజంగా సమతుల్యత పునరుద్ధరించ బడింది.

ముగింపు సందేశం :

శాస్త్రం మనకు మంచి జీవనాన్ని నిర్మించడంలో సహాయ పడుతుంది. కానీ మనసులను మార్చి, ప్రపంచాన్ని మెరుగుపరిచేది కథలు, కళలు.

మన సమాజం, ప్రకృతి, భవిష్యత్తు – ఇవన్నీ కాపాడటానికి ఈ రెండు కలిసే పని చేయాలి.

**గమనిక:** "శాస్త్రం జీవితం కోసం మార్గం చూపుతుంది..... కథలు జీవనానికి అర్థం ఇస్తాయి"

- హనీబీ (35-2) ఏప్రిల్ - జూన్ 2024 సంచిక నుండి

మూలం : Healing Forest – Forest Stories

సంపుటి-14 సంచిక - 2 మార్చి - ఏప్రిల్ 2026

# పల్లెసృజన

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్– 500 094.
ఫోన్ : 040–49253096, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సంపాదకులు :
**జమ్మలమడక శశిమోహన్**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్**
**జమ్మలమడక శ్రీకర్**
**డా. కల్పనా శాస్త్రి**

డిజైనింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్**, హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail : narendragrafixhyd@gmail.com

## ఈ సంచికలో.....

* మొక్కజొన్న విత్తటానికి సరైన పరిష్కారం - ఏసయ్య రూపొందించిన విత్తన పరికరం - 4
* కూలీల కొరతకు చెక్.... కోత ఖర్చును సగానికి తగ్గించే వినూత్న ఆవిష్కరణ చేసిన ఉసరపు నాగయ్య : ట్రాక్టర్‌కు అనుసంధానించే.. మొక్కజొన్న కంకులు కోసి, దంటును ముక్కలు చేసే యంత్రం - 7
* జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు - 10
* మార్చి - ఏప్రిల్ 2026లో జరిగిన పల్లెసృజన విశేషాలు - 14
* 53వ జాతీయ శోధయాత్ర - ప్రేమ మరియు సేవా దృశ్యాలను పునరుద్ధరించడం - 16
* 'పల్లె సృజన' ఇన్నోవేటర్లకు అంతర్జాతీయ గుర్తింపు - 20
* ఇన్నోవేషన్లను సృజనాత్మకంగా ఉపయోగించుకుని, శ్రమ, ఖర్చు, సమయం తగ్గించుకుంటున్న సృజనాత్మక రైతులు - 21
* డా. ఎపిజె అబ్దుల్ కలాం చిన్న పిల్లల సృజనాత్మకత మరియు ఇన్నోవేషన్ పురస్కారాలు - 23
* పల్లె జ్ఞానం - 25
* ఎన్ఐఎఫ్ వారి 'పీపుల్స్ ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్' 4వ ఉత్సవాలు - కొత్త ఢిల్లీ -2025 - 27
* ఆయుర్వేద జ్ఞాన మథనం - 30

కవర్ లోపలి పేజీలో ...

'హనీబీ' ప్రేరణాత్మక కథ - విద్యావిధానం పరిసర ప్రకృతిపై ఆధారపడాలి.
అమ్మకానికి సిద్ధంగా ఉన్న గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

Published as a Degital Magazine in pdf format, Published and Owned by **P. Ganesham** 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**

**HoneyBee Regional Collaborators & Publications**

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Nam Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# గ్రామ స్వయం సమృద్ధి ఎలా సాధించాలి?



చిన్న శోధయాత్ర పల్లెసృజన రెండు తెలుగు రాష్ట్రాల్లో సంవత్సరానికి నాలుగు సార్లు 50-60 కి.మీ. పాదయాత్ర గ్రామీణ ప్రాంతాల్లో, అడవుల్లో, గిరిజన గ్రామాల్లో అందరినీ కలుస్తూ, సంభాషిస్తూ, నేర్చుకుంటూ ముందుకు సాగుతుంది. ఈ యాత్రలు నిజంగా జ్ఞానశోధ యాత్రలే. యువతీ యువకులు తమను జీరో చేసుకుని గ్రామప్రజల భావాలు వింటారు. నేర్చుకుంటారు. వారికి ఏమీ చెప్పరు. ఇతర గ్రామాల్లో చూసి నేర్చుకున్న పల్లె జ్ఞానాన్ని, పల్లె ఆవిష్కరణలను ఈ గ్రామ ప్రజలకు అందజేస్తారు. యాత్ర ప్రయోజనం పల్లె జ్ఞాన వ్యాప్తి. సమాంతరంగా గ్రామం నుండి గ్రామానికి, రైతునుండి రైతుకు, ఈ భూ ప్రాంతం నుండి మరో భూప్రాంతానికి సమానాంతరంగా, అర్థవంతంగా జ్ఞాన ప్రసరణ, జ్ఞాన వ్యాప్తి ఈ చిన్న శోధయాత్రల ప్రధాన ఉద్దేశ్యం.

యాత్రికులు గ్రామస్తులతో విరివిగా సంభాషణల్లో నిమగ్నమవుతారు. గ్రామాల్లో జరుగుతున్న వ్యవసాయ కార్యక్రమాలు, వారి ఆరోగ్యం, ఆర్థిక వ్యవస్థ, వలసలు-వాటి ప్రభావాలు, మహిళలకు గౌరవస్థానం, నీటి లభ్యత, గ్రామేతర వ్యవస్థలపై ఆధారపడటం, ప్రకృతితో సమన్వయం, ఆహార అలవాట్లు, ఆధునికత ప్రభావం వగైరా అన్ని కోణాల్లో గ్రామాలను అర్థం చేసుకోవడానికి శాయశక్తులా యాత్రికులు ప్రయాస పడతారు. మహిళలు, స్కూలు పిల్లలు, కళాకారులు, క్రీడాకారులు, వృత్తి నైపుణ్యాలు, మూలికా వైద్యులు, జాతీయ గుర్తింపు పొందిన వ్యక్తులు..... ఇలా అందరిని కలుస్తూ, కుతూహలంతో నేర్చుకోవాలన్న తపనతో ముందుకు సాగుతారు చిన్న శోధయాత్రికులు. ఈ విధంగా ఇప్పటివరకు 57 యాత్రలు పూర్తి చేసింది 'పల్లెసృజన'. ప్రథమ యాత్ర 2011 ఏప్రిల్ మాసంలో ప్రారంభమైంది. వివరాలు పల్లెసృజన వెబ్‌సైట్‌లో ..... లభిస్తాయి.

ఈ యాత్రల్లో ముఖ్యంగా గమనించిన అంశాలను చర్చిద్దాం. యాత్రలో ప్రముఖంగా గ్రామాల్లోకి బయటినుంచి ఏ అవసరాలు వస్తున్నాయి, గ్రామం నుండి బయటకు ఏం వెళ్తున్నాయి? ఎగుమతి - దిగుమతి - వాటి వివరాలను క్లుప్తంగా సేకరించి గ్రామ ప్రజలతో చర్చలు జరుగుతాయి. 57వ యాత్రలో జహీరాబాదు మండలంలో మొదటి రోజులో పయనించిన గ్రామాల్లో వరి పంట అసలు కనిపించలేదు. ప్రత్తి, చెరకు, మిరప, మొక్కజొన్న మాత్రమే పండిస్తారు. వారు రోజూ తినే ఆహారాన్ని - బియ్యం, పప్పులు, కూరగాయలు... కొనుక్కుంటారు. అంటే వ్యాపార పంటల విధానాన్ని పూర్తిగా అనుసరిస్తారు. దీనికి ముఖ్య కారణం నీటి వసతి పుష్కలంగా లేకపోవడం వల్లనే అని గ్రామస్తులు వక్కాణించారు. ఒకరకంగా ఈ పద్ధతి సరియైనదిగా అనిపించినా, నిత్యావసరాలకై బాహ్య వ్యవస్థలపై ఆధారపడటం గ్రామానికి ఏమాత్రంగానూ క్షేమం కాదు. ఆరోగ్యం, ఆనందం, ఆర్థిక ప్రగతి - వీటికై ఆధారపడటంతో దిగుమతుల ఆధారంగా జీవనం సాగించడం విపరీతాలకు దారితీస్తాయి. తమకు కావలసింది గ్రామంలో పండించుకుని గ్రామంలోనే వాటిని వాడుకునేలా చేస్తే "స్వయం సమృద్ధి" గ్రామంలో వర్ధిల్లుతుంది.

పై అంశాన్ని 57వ చిన్న శోధయాత్రలో ..... యువ సర్పంచులు, పెద్ద రైతులు, పెద్దమనుషులు, మహిళలు, యువతతో చర్చించడం జరిగింది. వారందరికీ "స్వయం సమృద్ధి" అంశం పూర్తిగా నచ్చింది. ఎలా దీన్ని సాధించాలో పూర్తిగా అవగాహన లేదు. యాత్రికులు వారికి కొన్ని పద్ధతులు సూచించారు.

గ్రామానికి కావలసిన ఆహారం ... బియ్యం, పప్పులు, నూనె, కూరగాయలు, పాలు, పండ్లు

బట్టలు, పశుగ్రాసం.... వగైరా జీవించడానికి అత్యవసరమైనవి. గ్రామ భూముల్లో పండించగల్గినవి వీటినంతా గ్రామస్థాయిలో తమ గ్రామావసరాలకై దిగుమతులు పూర్తిగా నిలిపి వేయాలి. స్వయం సమృద్ధికి కావలసిన వివరాలు ప్రథమంగా గ్రామావసరాలు, రెండవది వాటిని పండించడానికి కావలసిన నీరు, ...... మూడవది ఆహార పంటలను తినడానికి యోగ్యంగా చేయడానికి గ్రామంలోనే వ్యవస్థ. ఈ మూడు ప్రధాన అంశాలకు సర్పంచులతో చర్చించడం జరిగింది. ఈ అవసరాలు గ్రామ క్షేమానికి చేపట్టడం జరుగుతున్నందున గ్రామవ్యవస్థ దీనికి బాధ్యత వహించాలి. ఎన్ని క్వింటాళ్ళ బియ్యం, పప్పులు, నూనె దినుసులు, పాలు కావాల్లో గ్రామస్థాయిలో నిర్ణయించి (ఒక సంవత్సరానికి), దానికి అనుగుణంగా ఎన్ని ఎకరాల్లో ఈ ఆహార ధాన్యాలు పండిస్తే, ఊరికి సరిపోతాయన్న నిర్ణయం సరిగ్గా చేయాలి. వాటిని పండించడానికి రైతులను ప్రోత్సహించాలి. వారికి సరియైన ధర ఇవ్వడానికి గ్రామస్తులు అంగీకరించాలి. రసాయన వ్యవసాయం ద్వారా గ్రామానికి కావలసిన ఆహార ధాన్యాలు పండించకూడదు. ప్రకృతి సేద్యం లేదా సేంద్రియ సేద్యం ఉత్తమం. వీటిని పండించడానికి ముందుకు వచ్చిన రైతులకు గ్రామం మొత్తం అన్ని విధాలా సహకరించాలి. ఎందుకంటే ఈ పంట అందరు గ్రామవాసులకే కదా!. నీటి వ్యవస్థకై ఈ పంటలకు ఉమ్మడి బోరు బావులను తవ్వాలి. ఇవి గ్రామ ఆస్తులుగా ఉండాలి. స్థానిక ప్రభుత్వాలు, స్థానిక వ్యవస్థలు ఉమ్మడి నీటి వ్యవస్థను గ్రామ స్వయం సమృద్ధి సాధనకై గ్రామంలో సృష్టించాలి. ఇవన్నీ సాధ్యమే అని గ్రామస్తులు మా సంభాషణల్లో ఒప్పుకున్నారు.

పంట పండించడం ఒక ఎత్తు, వాటిని తినే యోగ్యం చేయడం మరోయెత్తు. పాతకాలంలో గ్రామంలోనే ఆహార యోగ్యంగా చేసే నైపుణ్యాలు ఉండేవి. కాలక్రమేణా అవి కనిపించడం లేదు. గ్రామస్తులకు పాత పద్ధతులను నేర్పడం అంత సులభం కాదు. కానీ సాంకేతికత సహాయంతో పంటలను ఆహార యోగ్యంగా చేయడానికి సరళమైన, అందుబాటులో ఉండే "గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు" గ్రామాలకు అందజేయాలి. పల్లెసృజన వద్ద ఈ సాధనాల వివరాలు లభ్యమౌతాయి. ఇలా మెల్లిమెల్లిగా గ్రామాలు తమ అవసరాలను తామే పండించుకుని, సమిష్టి సహకారంతో, దిగుమతులు తగ్గించుకోవాలి. గ్రామేతర వ్యవస్థపై ఆధార పడటం మెల్లి మెల్లిగా మానుకోవాలి. ఇవన్నీ పల్లెసృజన శోధ యాత్రికులతో సంభాషించిన సర్పంచులు, వయోవృద్ధులు, మహిళలు .... ఏకగ్రీవంగా అంగీకరించారు.

అయితే ఎలా ప్రారంభించాలి?, ఎవరు బాధ్యత తీసుకోవాలి, సాంకేతిక, ఆర్థిక సహకారాలు ఎలా వస్తాయి?, ప్రభుత్వం పాత్ర ఏమిటి? స్థానిక ప్రజా ప్రతినిధులు ఏవిధంగా తోడ్పడతారు అన్న అంశాలు చర్చించాలని గ్రామస్తులు వక్కాణించారు.

గ్రామ స్వయం సమృద్ధి, ఒక్కొక్క గ్రామానికి వేరువేరుగా కాకుండా ఒక 30-40 గ్రామాల సమూహానికి పాటిస్తే బాగుంటుందని పల్లెసృజన విశ్వాసం. మా ఉద్దేశ్యంలో పైన వివరించిన స్వయం సమృద్ధి సాధించడానికి ప్రతిపాదించిన కార్యం పూర్తిగా సాధ్యమే. దానిపై చర్చించడానికి పల్లెసృజన సిద్ధంగా ఉంది. మమ్మల్ని గ్రామాలకు ఆహ్వానించినా సరే, లేదా 20-30 గ్రామస్తులు పల్లెసృజనకు (సికింద్రాబాద్‌లో) వచ్చి చర్చించి మా ఆతిథ్యాన్ని స్వీకరించినా సరే. అందరం కలసి ఒక అడుగు ముందుకు వేద్దాం. గ్రామ స్వయం సమృద్ధి దిశలో కలసి ముందుకు సాగుదాం.

అనుకోకుండా ఈ సంచిక మొక్కజొన్న ప్రాధాన్యతగా సంతరించుకుంది. రైతులకు ఉపయోగ పడే రెండు ఇన్నోవేషన్లు మొక్కజొన్నతో ఆరోగ్యానికి సూచనలు పాఠకులకు ఉపయోగ పడతాయని విశ్వసిస్తున్నాము.

వర్షాకాలం అంతంత మాత్రంగా ఉంది. రైతులను గ్రామ ప్రజలను సంకట స్థితికి తీసుకు వెడుతుందేమో. అందరం జాగ్రత్తగా ముందుకు సాగుదాం.

లోకా సమస్తా సుఖినోభవంతు!!

భవదీయ

బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)

**"పల్లెసృజన విశ్వాసం"**

✤ రైతులు గ్రాహకులు కాదు సమకూర్చేవారు (ప్రొవైడర్స్) ✤ ఊళ్ళు అంతులేని బావులు కాదు - అవి ఆధారాలు (సోర్స్)

## మొక్కజొన్న విత్తటానికి సరైన పరిష్కారం

# ఏసయ్య రూపొందించిన విత్తన పరికరం



- వీరరాఘవ రెడ్డి

ప్రస్తుతం రైతులు మొక్కజొన్న సాగుపై ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారు. దానికి కారణం మిగతా పంటలకు అయ్యే కూలీల ఖర్చుకన్నా ఇందులో తక్కువ అన్నది ఒక కారణమైతే, మొక్కజొన్నకు ఎక్కువగా పురుగు మందులు పిచికారి చేయాల్సిన అవసరం ఉండదు. కానీ ప్రస్తుతం యావత్ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్య ఒక్కటే "కూలీల లేమి". ఈ మొక్కజొన్న సాధారణ జొన్న, కొర్రలు లాగా జడిగంతో విత్తనం వేయటం కుదరదు. ఎందుకంటే జడిగంతో విత్తనం వేయటం వల్ల చాలా దగ్గర దగ్గరగా విత్తనం పడటంతో పైరు అంత బాగా ఎదగదు. కాబట్టి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రతి మొక్కజొన్న విత్తాలి అనుకున్న రైతు వాటిని కూలీల చేతనే ఒక్కో విత్తనం చేతితో నాటిస్తాడు. ఒక ఎకరా పొలంలో విత్తనం నాటడానికి నలుగురు కూలీలు అవసరం అంటే రూ. 2 వేలు ఖర్చవుతుంది.

ఈ సమస్య ను పరిష్కరించడానికి ప్రకాశం జిల్లా ఇంకొల్లుకు చెందిన ఇన్నోవేటర్ "ఇనగంటి ఏసయ్య" వద్దకు ఒక రైతు వచ్చి తన సమస్యను తెలియజేశాడు. "మొక్కజొన్న కూలీలతో నాటించాలంటే చాలా ఖర్చవుతుంది, పైగా కూలీల లభ్యత కూడా చాలా ఇబ్బందిగా అంది. కాబట్టి దీనికి అవసరమైన ఒక విత్తనం గొర్రు తయారు చేసేందుకు ప్రయత్నించు" అని అడగటం జరిగింది.

సాధారణంగా ఒక ఎకరం పొలంలో మొక్కజొన్న విత్తనం నాటాలంటే ఎకరాకు కనీసం నలుగురు వ్యక్తులు అవసరం అవుతారు. ఒక్కో వ్యక్తి కూలీ రూ. 500/– ప్రకారం మొత్తం 5 ఎకరాల పొలంలో మొక్కజొన్న నాటాలంటే రూ. 10 వేలు ఖర్చవుతుంది. పైగా కూలీలు ఒక్కో వ్యక్తి ఒక్కో విధంగా, అంటే కొందరు లోతుగా విత్తనం నాటుతారు, కొందరు పైపైనే విత్తనం నాటుతారు. విత్తనం నాటడానికి ఎద్దులతో అచ్చు లాగి ఆ అచ్చులో ఆడవారిచేత 6 అంగుళాలు లేదా 9 అంగుళాల విత్తనం మధ్య దూరం ఉండేటట్లుగా నాటిస్తారు. నాటిన వారు పక్కనే ఉన్న మట్టితో విత్తనం పైన కప్పుతారు. విత్తనం నాటాలంటే ఆ వ్యక్తి ఒక వేలితో భూమిలో రంధ్రం చేసి, అందులో విత్తనం వేసి, ఆ తర్వాత ఆ రంధ్రాన్ని పూడ్చటానికి







చేతితో మట్టిని కప్పి వేయాల్సి ఉంటుంది. ఇందులో ఏ ఒక్క పని సరిగ్గా చేయలేక పోయినా విత్తనం సరిగ్గా మొలవదు. అంటే లోతుగా వెయ్యక పోయినా, విత్తిన తర్వాత ఆ రంధ్రాన్ని మట్టితో పూడ్చక పోయినా ఏదో ఒక సమస్య తప్పక వస్తుంది. పైగా మనిషి విత్తనాన్ని సమాన దూరంలో నాటడం కుదరదు. ఒక్కో వ్యక్తి దూరం దూరంగ నాటితే, మరో వ్యక్తి దగ్గర దగ్గరగా నాటుతాడు. ఇలా చేయడం వల్ల పొలం పంట అంతా ఒకే విధంగా కనిపించదు. ఇందువల్ల కూడా పంట దిగుబడి పై ప్రభావం పడే అవకాశం ఉంటుంది.

ఈ సమస్యలన్నింటికి సమాధానంగా ఒక ట్రాక్టరు అనుసంధానిత పరికరం తయారు చేశాడు ఇంకొల్లుకు చెందిన 'ఏసయ్య' అనే ఇన్నోవేటర్.

ఈ పరికరం 6 నుండి 9 అంగుళాల దూరంలో ఒక్కో విత్తనం నాటుతుంది, విత్తనం నాటిన తర్వాత ఆ విత్తనం వేసిన సాలుపై మట్టి కప్పుకునే విధంగా వెనకాలే 'గుంటక' పరికరం తో మట్టిని పూడ్చుతుంది. విత్తనం కూడా సమాన లోతులో పడటం వల్ల పొలంలో మొలక శాతం కూడా అధికంగా ఉంటుంది. ఈ పనంతా యాంత్రికంగా జరుగుతుంది కాబట్టి మొక్కకు మొక్కకు మధ్య సమాన దూరం పాటించ బడుతుంది. కాబట్టి పొలం మొత్తం ఒకేవిధంగా మొలకెత్తటం జరుగుతుంది. అలా సమాన దూరంలో మొక్కలు ఉండటం వల్ల పైరుకు గాలి, వెలుతురు సమానంగా తగలటంతో పంట ఆరోగ్యంగా, ఏపుగా పెరుగుతుంది. పొలం మొత్తం పంట ఎక్కువ, తక్కువ దూరం లేకుండా సమానంగా విత్తడం జరుగుతుంది.

ఈ పరికరంలో విత్తనం సమాన దూరంలో పడటానికి అతను చేసిన విత్తనం తీసుకు వెళ్ళే భాగాలు (వీటిని అతను విత్తనం గుండీలు అంటాడు) సమాన దూరంలో విత్తనం నాటడానికి ఉపయోగ పడతాయి. అవసరం అనుకుంటే ఈ చక్రం యొక్క పరిధి చైన్ సరిచేయుటం ద్వారా మొక్కకు మొక్కకు మధ్య దూరాన్ని 6 నుండి 9 అంగుళాల వరకు మార్చుకోవచ్చు. అంటే బలమైన భూమిలో కొద్దిగా దూరంగా ఉండాలంటే 6 అంగుళాల దూరం పాటించవచ్చు, తేలికపాటి భూముల్లో ఆ మొక్కల దూరాన్ని 9 అంగుళాలకు పెంచుకోవచ్చు.

ఈ సాధనంతో మొక్కజొన్న విత్తనం నాటడానికి ఒక



ఎకరం పొలాన్ని ఒక గంటలో విత్తుకోవచ్చు. ఇందుకు అయ్యే ఖర్చు భూమిని బట్టి ఒకటి లేదా ఒకటిన్నర లీటర్ల డీజిల్ మాత్రమే ఖర్చు అవుతుంది.

మనుషులు విత్తడం వల్ల సమాన దూరం పాటించడం కష్టమే. కానీ, ఈ పరికరం ద్వారా విత్తినట్లయితే, అచ్చును ప్రత్యేకంగా తోలాల్సిన అవసరం లేదు. దీనివల్ల అయ్యే ఖర్చు కేవలం రూ. 4 వేలు అవుతుంది (ఇది ట్రాక్టరు కిరాయికి తీసుకున్న వారికి మాత్రమే). అదే స్వంత ట్రాక్టరు ఉన్న వారికైతే ఎకరాకు ఒకటి నుండి ఒకటిన్నర లీటర్ల డీజిలు మాత్రమే ఖర్చవుతుంది. రైతుకు 50 నుండి 80% వరకు ఖర్చు తగ్గుతుంది. కూలీలు లభించరు అన్న సమస్య ఉండదు, కాబట్టి ఖర్చు, శ్రమ, సమయం అన్నీ రైతుకు లభ్యమయ్యే అవకాశం ఉంటుంది. అంతే కాక సమాన దూరంలో పంట విత్తుకోవటం వల్ల పైరు బాగా ఎదిగి అధిక దిగుబడి వస్తుంది.

ఒక ఎకరం పొలంలో మొక్కజొన్న విత్తటానికి ఒక గంటకన్నా తక్కువ సమయంలోనే అయిపోతుంది. అంటే రోజుకు కనీసం 8 నుండి 10 ఎకరాల పొలంలో మొక్కజొన్న విత్తుకోవచ్చు. ఇందుకు అయ్యే కూలీల ఖర్చు ఉండదు. ట్రాక్టరు డ్రైవర్ ఎలాగూ ఉంటాడు కాబట్టి అవసరమైనప్పుడు విత్తనాన్ని ఆ పరికరంలో నింపేటందుకు రైతు తోడుగా ఉంటే చాలు. కనీసంలో కనీసం రైతుకు 50% ఖర్చు మిగలుతుంది.

కూలీలు లభించటం లేదు అని బాధ పడాల్సిన అవసరం లేదు, వారు సరిగ్గా విత్తనాన్ని నాటుతున్నారా లేదా అని గమనించాల్సిన అవసరం లేదు, ఎంతో సమయాన్ని వెచ్చించాల్సిన అవసరం లేదు. అంటే ఖర్చు, సమయం, నాణ్యత అన్నీ కలిసి వచ్చే ఈ యంత్రాన్ని రైతులు వినియోగించుకుని, తమ పెట్టుబడి తగ్గించుకోవాలని కోరుతోంది "పల్లెసృజన".





ఈ పరికరం ఖరీదు రూ. 70 నుండి 75 వేల వరకు ఉంటుంది. ఇన్నోవేటర్ ఏసయ్య ఇప్పటికే వీటిని గత 5 సంవత్సరాలలో 30కి పైగా పరికరాలను రైతులకు అందించాడు. కావలసిన వారు ఇన్నోవే టర్‌ను నేరుగా సంప్రదించి పరికరం కొనుగోలు చేసుకోగలరు.

ఈ ఇన్నోవేషన్ మొక్కజొన్న రైతులకు చాలా లాభకరంగా ఉన్నందువలన 'పల్లెసృజన' ద్వారా దీనికి జాతీయ గుర్తింపు, పేటెంటుకై ఎన్ఐఎఫ్ ద్వారా 'పల్లెసృజన' ప్రయత్నిస్తోంది.

**ఇన్నోవేటర్ : ఏసయ్య, ఇంకొల్లు. ఫోన్ : 99638 36951**

## పల్లెసృజన 'డిజిటల్ పత్రిక' పై మీ అభిప్రాయాలు కోరుతూ...

**'పల్లెసృజన' పత్రిక ఇకనుండి ముద్రణ రూపంలో రాదు, డిజిటల్ రూపంలోనే వస్తుందని పాఠకులకు తెలియజేయడమైనది. మీరు చూస్తున్న ఈ డిజిటల్ పత్రికపై మీ అభిప్రాయాలను తెలియ జేయ వలసిందిగా పాఠకులను కోరుతున్నాము. ఇంకా ఈ డిజిటల్ పత్రికలో మీరు ఏమైనా మార్పు, చేర్పులు కోరుకుంటుంటే నిర్మొహమాటంగా మాకు తెలియజేస్తే వీలైనంత వరకు మీ అభిరుచి మేరకు మార్పులు చేయటానికి ప్రయత్నిస్తామని తెలియ జేస్తున్నాము. మీ అభిప్రాయాన్ని వాట్స్ యాప్ ద్వారా 98 6600 1678 లేదా 81257 99904 నంబర్లకు పంపగలరు.**

**- ఎడిటర్**

**కూలీల కొరతకు చెక్, కోత ఖర్చును సగానికి తగ్గించే వినూత్న ఆవిష్కరణ చేసిన ఉసరపు నాగయ్య**

# ట్రాక్టర్‌కు అనుసంధానించే
# మొక్కజొన్న కంకులు కోసి, దంటును ముక్కలు చేసే యంత్రం



- వీరరాఘవ రెడ్డి

మొక్కజొన్న సాగులో అధిక దిగుబడులు సాధించినా రైతులకు కోత సమయంలో కూలీల కొరత, కోత ఆలస్యం, వాతావరణ మార్పులు, అధిక ఖర్చులు పెద్ద సమస్యగా మారుతున్నాయి. ఈ సమస్యల పరిష్కారంగా బాపట్ల జిల్లా రైతు ఉసరపు నాగయ్య ట్రాక్టర్‌కు అనుసంధానించే మూడు వరుసల మొక్కజొన్న నూర్పిడి యంత్రాన్ని రూపకల్పన చేశారు.

## ఆవిష్కర్త పరిచయం

**ఉసరపు నాగయ్య,**
బాపట్ల జిల్లా
ఆంధ్రప్రదేశ్

ఫోన్ :
**63013 37368**



## ప్రత్యేకతలు

- మూడు వరుసల పంటను ఒకేసారి కోస్తుంది.
- ఇది ట్రాక్టర్ పిటిఓ షాఫ్ట్ ద్వారా నడిచే యంత్రం,
- కన్వేయర్ ద్వారా కంకులను పైకి తీసుకెళ్తుంది.
- కంకులను నేరుగా వెనక ఉన్న ట్యాంకులోకి చేరుస్తుంది.
- చొప్పదంటును 3–4 అంగుళాల ముక్కలుగా కత్తిరిస్తుంది.
- సమయం, కూలీల ఖర్చు 50% వరకు ఆదా.

## యంత్రం పనిచేసే విధానం



యంత్రం పొలంలోకి వెళ్ళిన తర్వాత పంటలోని మూడు వరుసల మొక్కజొన్న పంటను ఒకేసారి కోస్తుంది.



యంత్రంలో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక గేర్‌బాక్స్ రోలర్లు కంకులను సేకరించి కన్వేయర్ బెల్టుకు తరలిస్తాయి.



కన్వేయర్ ద్వారా కంకులు పైకి వెళ్ళి వెనుకభాగంలో అమర్చిన ట్యాంకులోకి చేరుతాయి. ట్యాంకు నిండిన వెంటనే వాటిని ఎక్కడైనా ఒకచోట కుప్పగా వేసుకోవచ్చు.

కంకుల కోత అనంతరం చొప్పను (పంట కాండాలను) చాపర్ బ్లేడ్‌ల సహాయంతో 3-4 అంగుళాల చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించివేస్తుంది. వీటిని పశువుల ఎరువుగా ఉపయోగించుకోవచ్చు లేదా అలాగే పొలంలో కలిపి దున్నేస్తే మంచి ఎరువుగా తరువాతి పంటకు పనికి వస్తుంది.



## యంత్రం సాంకేతిక వివరాలు

| | | |
|---|---|---|
| యంత్రం | : | ట్రాక్టర్ అనుసంధానిత మొక్కజొన్న నూర్పిడి యంత్రం |
| నడిచే విధానం | : | ట్రాక్టర్ వెనక ఉన్న పిటిఓ షాఫ్ట్ సహాయంతో పని చేస్తుంది. |
| లిఫ్టింగ్ & కట్టర్ | : | హైడ్రాలిక్ వ్యవస్థ |
| సామర్థ్యం | : | గంటకు సుమారు 6 నుండి 8 క్వింటాళ్ల కంకులు. |
| అవసరమైన ట్రాక్టర్ | : | 50 హార్స్‌పవర్‌ల సామర్థ్యం లేదా అంతకన్నా ఎక్కువ |
| యంత్రం ధర (అంచనా) | : | రూ. 6.5 లక్షలు (ట్రాక్టర్ మినహా మిగిలిన భాగాలు మాత్రమే) |

## యంత్రం పని చేసే దృశ్యాలు


మొక్కజొన్న మొక్కలను సేకరిస్తుంది


కంకులను కన్వేయర్ బెల్టుపైకి పంపుతుంది


కన్వేయర్ నుండి వెనకాల ఉన్న ట్యాంకులో కంకులను వేస్తుంది

## రైతులు కలిగే ప్రయోజనాలు

- ఒక రోజులో 5 ఎకరాల వరకు కోత కోస్తుంది.
- కూలీల ఖర్చు సగానికి తగ్గుతుంది.
- సమయానికి కోత పూర్తి చేసి, పంట నష్టాలు నివారించుకోవచ్చు.
- కంకులను ఒకేచోటకు సేకరించుకోవడం సులభం.
- పశువుల మేతకు ఉపయోగ పడే విధంగా మొక్కజొన్న మొక్కలను ముక్కలుగా చేస్తుంది. పశువులు లేనివారు ఆ ముక్కలను అలాగే పొలంలో కలిపి దున్నినట్లయితే, పొలానికి మల్చింగ్ గాను, ఎరువుగాను ఉపయోగ పడుతుంది.

## మనుషులు చేసే పనికి - యంత్రం చేసే పనికి పోలిక (5 ఎకరాలకు)

**చేతితో చేసే పని వల్ల అయ్యే ఖర్చు**

| | | |
|---|---|---|
| కంకుల కోత కూలీల ఖర్చు ఎకసాకై 8 మంది | : రూ. 4,000/-x 5 = | 20,000/- |
| కంకులు ఎత్తి ఒకచోట చేర్చటానికి: 8 మంది | : రూ. 4,000/-x 5 = | 20,000/- |
| అదనపు ఖర్చులు | : రూ. 1,000/x5= | 5,000/- |
| **మొత్తం 5 ఎకరాల సాగుకై ఖర్చు** | **: రూ.** | **45,000/-** |

**యంత్రంతో పని చేస్తే**

| | |
|---|---|
| 4గురు కూలీల ఖర్చు: | రూ. 2,000/- |
| యంత్రం కిరాయి : | రూ. 20,000/- |
| **మొత్తం 5 ఎకరాలకు:** | **రూ. 22,000/-** |

**ఒక్కరోజులో 5 ఎకరాల రైతుకు ఆదా అయ్యే మొత్తం రూ. 23,000/-.**
**అంటే మొక్కజొన్న కంకుల కోత ఖర్చు 50% కు పైగా తగ్గుతుంది.**

**ఈ యంత్రానికి జరుగుతున్న అభివృద్ధి పనులు :**
ఈ యంత్రాన్ని మరింత మెరుగు పరచడంతో పాటు, మొక్కజొన్న కంకుల నుండి గింజలను కూడా వేరు చేసే సదుపాయాన్ని ఏర్పాటు చేసే పనులు చేయాల్సి ఉంది.

ఈ యంత్రానికి సరియైన గుర్తింపు, పేటెంటు కొరకు పల్లెసృజన ఎన్ఐఎఫ్ ద్వారా ప్రయత్నాలు చేస్తోంది.



# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## ఇంటర్ లాకింగ్ ఇటుకల తయారీ యంత్రం

పేటెంట్ దరఖాస్తు సంఖ్య : 227/KOL/2015

ఆవిష్కర్త : **ఉమేష్ చంద్ర శర్మ,** అస్సాం.

### పరిష్కరించిన సమస్య:

సాధారణంగా ఇంటర్ లాకింగ్ ఇటుకలను చేతితో తయారు చేయడం వల్ల రోజుకు ఉత్పత్తి చాలా తక్కువగా ఉంటుంది. దీంతో మార్కెట్ అవసరాలకు సరిపడా సరఫరా చేయడం కష్టం అలాగే కూలీల ఖర్చు పెరగటం వల్ల ఇటుకల ఖరీదు కూడా పెంచాల్సి వస్తుంది. ఈ సమస్యను అధిగమించడానికి ఉమేష్ చంద్ర శర్మ 'ఇంటర్ లాకింగ్ ఇటుకల తయారీ యంత్రం' అభివృద్ధి చేశాడు. దీని ద్వారా ఉత్పత్తి సామర్థ్యం పెరిగి, ఉపాధి మరియు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయి.

### సాంకేతిక వివరాలు:

- ఈ యంత్రంలో ప్రధానంగా చాసిస్ ఇటుక ఆకృతి అచ్చు (మౌల్డు) మరియు వైబ్రేషన్ యూనిట్ ఉంటాయి.
- ముడి పదార్థాన్ని అచ్చుల్లో పోస్తారు.
- వైబ్రేషన్‌తో పదార్థం అచ్చుల్లో గట్టిగా నింపబడుతుంది.



- అనంతరం స్క్రూ జాక్ సహాయంతో ఇటుక తయారీ యూనిట్ పైకి లేచి, అచ్చులోని ఇంటర్ లాకింగ్ ఇటుకలను ఒత్తిడి ద్వారా తయారు చేస్తుంది.

### యంత్రం పరిమాణం:

- పొడవు : 4 అడుగులు
- వెడల్పు : 5 అడుగులు
- ఎత్తు : 2.5 అడుగులు.
- బరువు : 600 కిలోలు.

### ముఖ్య విశేషాలు:

- ఈ యంత్రం ఒకేసారి 44 ఇటుకలను తయారు చేయగలదు.
- ఒక బ్యాచ్ తీయటానికి 20 నిమిషాలు పడుతుంది.
- తయారైన ఇంటర్ లాకింగ్ ఇటుకలు సాధారణ ఇటుకల పరిమాణం (2.5 అంగుళాలు - 4 అంగుళాలు - 9 అంగుళాలు) కలిగి ఉంటాయి.
- అచ్చులను మార్చడం ద్వారా ఇంటర్ లాకింగ్ ఇటుకలతో పాటు సాధారణ ఇటుకలను కూడా తయారు చేయవచ్చు.
- వాటికి హైడ్రాలిక్ ప్రెస్ అవసరం లేదు.

### ప్రయోజనాలు:

- చేతితో చేసే ఇటుకలు శ్రమతో కూడుకున్నవి, ఎక్కువ





సమయం పడుతుంది. ఈ యంత్రం ఆ సమయాన్ని గణనీయంగా తగ్గిస్తుంది.

- విద్యుత్‌తో పనిచేసే ఈ యంత్రం ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతుంది.
- అచ్చులను మార్చడం ద్వారా వివిధ రకాల ఇటుకలను తయారు చేయవచ్చు.
- ఇతర ప్రత్యామ్నాయ యంత్రాలతో పోలిస్తే తక్కువ విద్యుత్ వినియోగిస్తుంది.
- ఇటుకల తయారీ రంగంలో మహిళలు అధిక సంఖ్యలో పని చేస్తున్నందున, ఈ యంత్రం మహిళలకు మరిన్ని ఉపాధి అవకాశాలను కల్పిస్తుంది.

**అవార్డులు మరియు గుర్తింపులు:**

ఈ ఆవిష్కరణకు గాను ఆవిష్కర్త 2015లో ఎన్ఐఎఫ్ నిర్వహించిన 8వ జాతీయ ద్వైవార్షిక గ్రామీణ ఆవిష్కరణలు మరియు సాంప్రదాయ జ్ఞాన పురస్కారాల కార్యక్రమంలో రాష్ట్రస్థాయి పురస్కారాన్ని అందుకున్నారు.

## పౌల్ట్రీ రేకింగ్ యంత్రం:

పేటెంట్ దరఖాస్తు సంఖ్య : 595/MUM/2013

ఆవిష్కర్త : **సురేష్‌భాయ్ నరోత్తంభాయ్ పటేల్,** గుజరాత్.

**పరిష్కరించిన సమస్య:**

పౌల్ట్రీ ఫారాల్లో కోళ్ళ ఆరోగ్యం మెరుగ్గా ఉండాలంటే షెడ్‌లో పేరుకుపోయే వ్యర్థాలను తరచుగా కలియబెట్టడాన్ని 'రేకింగ్' అంటారు. అయితే కార్మికుల కొరత కారణంగా ఈ పనిని చేతితో చేయడం కష్టంతో కూడుకున్నపని. ఈ సమస్యను ఎదుర్కొన్న ఆవిష్కర్త తన పౌల్ట్రీ ఫారంలో ఈ ప్రక్రియను యాంత్రీకరించాలన్న ఆలోచనతో పౌల్ట్రీ రేకింగ్ యంత్రాన్ని తయారు చేశాడు.

**ఉత్పత్తి వివరాలు:**

ఈ పౌల్ట్రీ రేకింగ్ యంత్రం విద్యుత్ ఆధారిత పరికరం. ఇది





పౌల్ట్రీ ఫారంలో పేరుకుపోయిన వ్యర్థాల పొరలను క్రిందనుండి పైకి తిప్పి కలియబెట్టడానికి ఉపయోగ పడుతుంది.

**సాంకేతిక వివరాలు:**

యంత్రాన్ని మనిషి నడిపిస్తూ పని చేసుకోవచ్చు. విద్యుత్ మోటారు బెల్ట్, పుల్లీలు, చైన్ మరియు స్ప్రాకెట్ల ద్వారా డ్రైవింగ్ షాఫ్ట్‌కు శక్తిని అందిస్తుంది. 1:34 నిష్పత్తిలో వేగాన్ని తగ్గించి యంత్రం ముందుకు కదులుతుంది. బ్లేడులతో కూడిన చక్రాల సహాయంతో రేకింగ్ ప్రక్రియ జరుగుతుంది.

**మోటారు:** ❀ 1 హెచ్‌పి సింగల్ ఫేజ్

**పుల్లీలు:** ❀ 1వది–25 సెం.మీ. ❀ 2వది–8 సెం.మీ. వ్యాసం

**బెల్ట్:** ❀ పొడవు : 103 సెం.మీ. ❀ వెడల్పు : 2 సెం.మీ.

**స్ప్రాకెట్లు:** 1వది : 20 సెం.మీ., 2వది : 6 సెం.మీ. వ్యాసం.

**చైన్:** పొడవు 85 సెం.మీ., వెడల్పు : 1.5 సెం.మీ.

**రేకింగ్ పరికరం:**

- మైల్డ్ స్టీల్‌తో తయారైన బ్లేడ్
- ప్రభావవంతమైన వెడల్పు : 75 సెం.మీ.

**చక్రాలు:** 40 సెం.మీ. వ్యాసం, రెండు లోహ చక్రాలు.

**ముఖ్య విశేషాలు:**

- రేకింగ్ కూలీల ఖర్చును 50 శాతం తగ్గిస్తుంది.
- ఇద్దరు వ్యక్తులతో గంటకు 15,000 చదరపు అడుగుల విస్తీర్ణాన్ని రేకింగ్ చేయవచ్చు.
- ఇదే పనిని చేతితో చేస్తే సుమారు 6 గంటల సమయం పడుతుంది.
- కోడిపిల్లల మరణాల రేటును తగ్గించడంలో సహాయ పడుతుంది.
- కోడిపిల్లల పెరుగుదల మరియు సంరక్షణను మెరుగు పరుస్తుంది.
- చేతితో చేసే రేకింగ్‌తో పోలిస్తే దుర్వాసన గణనీయంగా తగ్గుతుంది.
- పౌల్ట్రీ షెడ్ పరిశుభ్రతను మెరుగుపరుస్తుంది.

**అవార్డులు మరియు గుర్తింపులు:**

ఈ ఆవిష్కరణకు గాను ఆవిష్కర్త 2013లో ఎన్ఐఎఫ్ నిర్వహించిన 7వ జాతీయ ద్వైవార్షిక గ్రామీణ ఆవిష్కరణలు మరియు సాంప్రదాయ జ్ఞాన పురస్కారాల కార్యక్రమంలో ప్రశంశా (కన్సోలేషన్) పురస్కారాన్ని అందుకున్నారు.



## అధిక దిగుబడినిచ్చే హెచ్ఎమ్‌టి వరి రకం:

ఆవిష్కర్త : **దాదాజీ రామాజీ ఖోబ్రగడే,** మహారాష్ట్ర

**ఆవిర్భావం:**

శ్రీ దాదాజీ రామాజీ ఖోబ్రగడే, జె.పి. పటేల్ అభివృద్ధి చేసిన ప్రసిద్ధ 'పటేల్-3' వరి రకాన్ని ఎంపిక చేసి, దానిపై సాంప్రదాయ ఎన్నిక పద్ధతుల ద్వారా హెచ్ఎమ్‌టి వరి రకాన్ని అభివృద్ధి చేశారు. ఈ రకాన్ని అభివృద్ధి చేయడానికి ఆయన తన చిన్న వ్యవసాయ క్షేత్రంలో ఐదు సంవత్సరాల పాటు నిరంతర అధ్యయనం, పరిశోధన నిర్వహించి విజయాన్ని సాధించారు.

**ప్రత్యేకతలు:**

- పొట్టి గింజలు కలిగిన వరి రకం.
- బియ్యం రికవరీ శాతం 75-80% వరకు ఉంటుంది.
- మంచి సువాసన కలిగి ఉంటాయి.
- వండినప్పుడు మంచి నాణ్యత, రుచి కలిగి ఉంటుంది.
- **పంట కాలం :** సుమారు 140 రోజులు.

**అనుకూల వాతావరణం:**

- ఉష్ణమండల మరియు ఉప ఉష్ణమండల ప్రాంతాలకు అనుకూలం.
- తగినంత వర్షపాతం అవసరం.
- 20 నుండి 40 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలో బాగా పెరుగుతుంది.

**పురుగులు - తెగుళ్ళను తట్టుకునేది:**

- కంకి తొలుచు పురుగు దాడిని తట్టుకునే సామర్థ్యం కలిగి ఉంటుంది.
- బ్లాస్ట్ తెగులుకు నిరోధకత కలిగి ఉంటుంది.

**ఇతర విశేషాలు:**

- ధాన్యం నిల్వ కాలం 2 సంవత్సరాలు.
- పంట ఒక సీజన్ పంట
- అధిక దిగుబడితో పాటు నాణ్యమైన బియ్యాన్ని అందించే రకం.
- మంచి సువాసన, వండితే నాణ్యత కారణంగా వినియోగదారుల ఆదరణ పొందిన రకం.



## సుర్జీత్ బాస్మతి - ఉప్పునీటిని తట్టుకునే వరి రకం:

ఆవిష్కర్త : **సుర్జీత్ సింగ్,** హర్యానా

**ఆవిర్భావం:**

2008 లో ఆవిష్కర్త తన పొలంలో 'పూసా-1460' వరి రకాన్ని సాగు చేశారు. అయితే షీత్ బ్లైట్ తెగులు కారణంగా దాదాపు మొత్తం పంట దెబ్బతింది. కానీ ఒకే ఒక్క మొక్క మాత్రం ఆరోగ్యంగా నిలిచింది. ఆ మొక్కను ప్రత్యేకంగా కోయించి, తదుపరి సంవత్సరంలో నాటారు.

ఆ తరువాత ఎక్కువ సంఖ్యలో పిలకలు కలిగి ఉండటం, పొడవైన గింజలు ఉండటం, ఫుట్-రాట్ వ్యాధి లేకపోవడం వంటి లక్షణాల ఆధారంగా 225 మొక్కలు ఎంపిక చేశారు. ఈ ఎంపిక ప్రక్రియను మరో రెండు సంవత్సరాలు కొనసాగించి, కావలసిన లక్షణాలు కలిగిన కొత్త వరి రకాన్ని అభివృద్ధి చేశారు. అదే 'సుర్జీత్ బాస్మతి-1'.

**ప్రత్యేకతలు:**

- అధిక దిగుబడినిచ్చే వరి రకం.
- హెక్టారుకు సుమారు 50 క్వింటాళ్ళ దిగుబడి వస్తుంది.
- అధిక నీటిని కూడా తట్టుకుంటుంది.
- ఫుట్-రాట్ వ్యాధి సోకదు.

**అనుకూల వాతావరణం:**

- ఉష్ణ, ఉప ఉష్ణమండల ప్రాంతాలకు అనుకూలం.
- తగినంత వర్షపాతం అవసరం.
- 20-40 డిగ్రీల సెం.గ్రే. ఉష్ణోగ్రతలో బాగా పెరుగుతుంది.
- వరి సాగుకు అనువైన తేమ, నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో మంచి ఫలితాలను ఇస్తుంది.

**పురుగులు - తెగుళ్ళను తట్టుకునేది:**

- నేలలో లేదా నీటిలో అధిక ఉప్పు ఉన్న పరిస్థితులను తట్టుకునే సామర్థ్యం కలిగి ఉంటుంది.

**ఇతర విశేషాలు:**

- నిల్వ కాలం 1 సం. ❀ పంట జీవిత కాలం : ఒక సీజన్
- ఉప్పు ప్రభావిత భూముల్లో సాగుకు అనువైన రకం.
- అధిక దిగుబడి మరియు వ్యాధి నిరోధకత కలిగి ఉండటం వల్ల రైతులకు లాభదాయకమైన పంట.

## జాతీయ పురస్కారం - మూడవ బహుమతి

**జె.కె.-1 అభివృద్ధి చేయబడిన చిక్కుడు రకం:**

ఆవిష్కర్త : **జీతాభాయ్ కొదర్‌భాయ్ పటేల్,** సబర్‌కాంతా జిల్లా, గుజరాత్.



గుర్తించి, ప్రోత్సహించిన సంస్థ :

**సృష్టి (SRISTI)**

జీతాభాయ్ కొదర్‌భాయ్ పటేల్ (68 సం.) ఆరు ఎకరాల భూమి కలిగిన రైతు. ఆయన తన పొలంలో చిక్కుడు, ఆముదం, పత్తి, సోయాబీన్, గోధుమలను ప్రధాన పంటలుగా, పశుగ్రాస పంటగా సాగు చేస్తున్నారు.

స్థానిక చిక్కుడు నుండి ఎంపిక పద్ధతి ద్వారా త్వరగా, అధిక దిగుబడి ఇచ్చే "చిక్కుడు" పంటలో మెరుగైన రకాన్ని ఆయన అభివృద్ధి చేశారు.

1987లో సమీప గ్రామం నుండి పశుగ్రాసం సేకరిస్తున్నప్పుడు అందులో కొన్ని మంచి గుత్తులుగా కాయలు వచ్చే చిక్కుడు కాయలు కనిపించాయి. వాటిని ప్రత్యేకంగా సేకరించి, మరుసటి యేదాది విత్తనంగా ఉపయోగించారు.

తర్వాతి సంవత్సరం కొద్దిపాటి విత్తనాలను తన పొలంలో నాటగా, కొన్ని మొక్కలు ఇతర మొక్కలకంటే ఎక్కువ గుత్తులుగా కాయలు కాస్తున్నాయని, అలాగే త్వరగా పంటకు వస్తున్నాయని గమనించాడు. అటువంటి మంచి లక్షణాలున్న మొక్కలను



ఎంపిక చేసి, వాటి విత్తనాలను విడిగా సేకరించాడు.

ఈ విధంగా ప్రతి సంవత్సరం కోరుకున్న లక్షణాలున్న మొక్కలను ఎంపిక చేస్తూ వరుసగా 8 సంవత్సరాలు శ్రమించాడు. చివరకు 1995లో ఈ రకం విత్తనాలను స్థిరపరిచాడు.

ఆ తర్వాత ఈ రకం విత్తనాలను పరిసర ప్రాంతాల రైతులకు పరీక్షల కోసం అందించాడు. అధిక దిగుబడి, రుచికరమైన కాయల కారణంగా ఈ రకం రైతుల్లో ఎంతో ప్రాచుర్యం పొందింది.

### జె.కె.-1 రకం చిక్కుడు ప్రత్యేకతలు:

- మొదటి కోతకు కేవలం 60-65రోజులు మాత్రమే పడుతుంది.
- ఆగస్టు నుండి ఏప్రిల్ వరకు దీర్ఘకాల కాయలు ఇస్తుంది.
- లేత ఆకుపచ్చ రంగులో మెరిసే పొడవైన గుత్తులుగా కాయలు కాస్తుంది.
- ఒక్కో మొక్కకు 700కు పైగా కాయలు వస్తాయి.
- పచ్చి కాయల దిగుబడి హెక్టారుకు 600 క్వింటాళ్ళకు పైగా వస్తాయి.
- కేవలం చిక్కుడు కాయల కూర చేసుకున్నా, మిశ్రమ కూర తయారీకి ఈ రకం అత్యంత అనుకూల మైనది.

### శాస్త్రీయ ధృవీకరణ:

2015-17 మధ్య గుజరాత్‌లోని 'సర్దార్ కృషినగర్ దాంతివాడ వ్యవసాయ విశ్వవిద్యాలయం' రెండు ప్రాంతాల్లో ఈ రకాన్ని పరీక్షించింది.

ఈ పరీక్షలో జె.కె.-1 రకం, ఇప్పటికే సాగులో ఉన్న ఇతర రకాలతో పోలిస్తే పచ్చి కాయల దిగుబడిలో 119.7 శాతం అధికంగా ఉన్నట్లు నిర్ధారించారు.

ప్రస్తుతం ఈ రకాన్ని గుజరాత్ రాష్ట్రంలోని సబర్‌కాంతా, అరవల్లి, పంచమహల్, దాహొద్, బనాస్‌కాంతా జిల్లాల రైతులు విస్తృతంగా సాగు చేస్తున్నారు.

అలాగే 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్)' మహారాష్ట్ర (పూణే పాల్‌ఘర్), రాజస్థాన్ (జైపూర్, సికార్) రాష్ట్రాల్లో రైతుల పొలాల్లో నిర్వహించిన క్షేత్ర పరీక్షల్లో కూడా ఈ రకం అధిక మార్కెట్ డిమాండ్, మంచి రుచి కారణంగా రైతుల నుండి విశేష ఆదరణ పొందింది.

ఈ రకానికి పంట రకాల సంరక్షణ మరియు రైతు హక్కుల ప్రాధికారి సంస్థ, న్యూఢిల్లీ లో నమోదు కోసం ఇప్పటికే దరఖాస్తు చేయడమైనది.

### ఎంపిక పద్ధతి అంటే ఏమిటి?

ఒకే పంటలో సహజంగా కనిపించే మంచి లక్షణాలు (ఎక్కువ దిగుబడి, త్వరగా పంటకు రావడం, రోగ నిరోధకత, రుచి మొదలైనవి) ఉన్న మొక్కలను ప్రతి సంవత్సరం జాగ్రత్తగా ఎంపిక చేసి, వాటి విత్తనాలను మాత్రమే తిరిగి సాగు చేస్తూ అనేక సంవత్సరాలు కొనసాగిస్తే చివరకు కొత్త, స్థిరమైన పంట రకం అభివృద్ధి అవుతుంది. దీనినే 'ఎంపిక పద్ధతి' అంటారు.

# మార్చి - ఏప్రిల్ 2026 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు










హైదరాబాద్ యూసుఫ్‌గూడ లోని NI-MSME క్యాంపస్‌లో MSME నిర్వహించిన ప్రదర్శనలో 35 'పల్లెసృజన' ఆవిష్కరణలతో 13 మంది ఇన్నోవేటర్లు పాల్గొన్నారు. కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (MSME), కేంద్ర కార్మిక మరియు ఉపాధి శాఖ సహాయ మంత్రి శ్రీమతి శోభా కరంద్లాజే గారు సందర్శించారు. NI-MSME డైరెక్టర్ జనరల్‌తో కలిసి, ఆవిష్కరణలను మంత్రిగారికి ప్రదర్శించి వివరించడం జరిగింది.




హైదరాబాద్ లోని 'అనురాగ్ విశ్వవిద్యాలయం' వారు మన ఇన్నోవేటర్ 'చింతకింది మల్లేశం' ను "గౌరవ డాక్టరేట్" తో సత్కరించడం జరిగింది. యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ గారి చేతుల మీదుగా డాక్టరేట్ పురస్కారాన్ని స్వీకరిస్తున్నప్పటి చిత్రం.



2026 మే, 11న కర్ణాటక రాష్ట్రం, బెంగుళూరుకు లోని CSB సంస్థ డైరెక్టర్ గారు వారి సంస్థ స్థాపన దినోత్సవం (annual day) సందర్భంగా మన ఇన్నోవేటర్ 'పద్మశ్రీ' పురస్కార గ్రహీత 'చింతకింది మల్లేశం'ను సత్కరించడం జరిగింది. ఆ సందర్భంగా తీసిన చిత్రం.


# మార్చి - ఏప్రిల్ 2026 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు













23 మార్చి, 2026న భువనగిరి జిల్లా బస్వాపూర్ లోని 'కస్తూర్బా గాంధీ ప్రభుత్వ బాలికల పాఠశాల మరియు జూనియర్ కళాశాల లో 'ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్' వారి సహకారంతో "పాఠశాల విద్యార్థులతో ముఖాముఖి/ సంభాషణ కార్యక్రమం నిర్వహించ బడింది. ఈ కార్యక్రమంలో 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చిన పునాది స్థాయి ఆవిష్కరణలు (Grassroots Innovations) విద్యార్థులకు ఇన్నోవేషన్లను గురించి, ఇన్నోవేటర్లను గురించి వివరించడమైనది. ఈ కార్యక్రమం పల్లెసృజన వాలంటీర్ సుభాష్ చందర్ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ శ్రీమతి రాధ గారు పాల్గొన్నారు.



యం.వి. ఫౌండేషన్ అధిపతి 'పల్లెసృజన' కార్యాలయాన్ని సందర్శించినప్పటి చిత్రం.



'పల్లెసృజన' ఇన్నోవేటర్ "గొర్రె అశోక్" రూపొందించిన స్ప్రేయర్‌ను 'నీతి ఆయోగ్' నిర్వహించిన వర్క్‌షాప్‌లో ప్రదర్శించడమైనది.



# 53వ జాతీయ శోధయాత్ర
# "ప్రేమ మరియు సేవా దృశ్యాలను పునరుద్ధరించడం"

**ఝాబువా మరియు అలీరాజ్‌పూర్ (మధ్యప్రదేశ్) మరియు ఛోటా ఉదయ్‌పూర్ (గుజరాత్)**

మధ్యప్రదేశ్ మరియు గుజరాత్ రాష్ట్రాల్లోని **23** గిరిజన గ్రామాలలో **105** కిలోమీటర్లకు పైగా కాలి నడకన సాగిన **53**వ శోధయాత్ర **10** రాష్ట్రాల నుండి **40** మంది యాత్రీకులను ఒక చోటకు చేర్చింది. ఈ ప్రయాణం సంస్కృతి, పట్టుదల మరియు సమాజ వికాసానికి ఒక సజీవ తరగతి గదిగా మారింది. ఇక్కడ యాత్రీకులు, గ్రామస్తులు, కళాకారులు, మహిళలు, యువత, రైతులు మరియు ఉపాధ్యాయులతో నేరుగా సంభాషించారు. ప్రతి పరస్పర చర్య కూడా అక్కడి సాంప్రదాయాలు మరియు అనుభవాలు ఒక బలమైన, స్వయం సమృద్ధి గల సమాజాన్ని ఎలా తీర్చి దిద్దాయో వెల్లడించింది. ఈవిధంగా శోధయాత్ర పరస్పర అభ్యాసానికి మరియు మానవీయ సంబంధాలకు ఒక అర్థవంతమైన ప్రయాణంగా ఆవిర్భవించింది.

**- వీరరాఘవ రెడ్డి**

ఈ ప్రయాణం ఒక జీవ వైవిధ్యం, గిరిజన సాంప్రదాయాలు, దేశీయ జ్ఞాన వ్యవస్థలతో సంపన్నమైన మధ్యప్రదేశ్ లోని ఝాబువా, అలీరాజ్‌పూర్ మరియు గుజరాత్ లోని ఛోటా ఉదయ్‌పూర్ లలోని గిరిజన ప్రాంతాల గుండా సాగింది. భిల్, రథ్వా, నాయక్ మరియు ధనుక్ వర్గాలకు నిలయమైన ఈ ప్రాంతాలు, వారి జీవనోపాధి పద్ధతుల యొక్క లోతైన సమగ్రతను ప్రతిబింబిస్తాయి. "హనీబీ నెట్‌వర్క్" తత్వ శాస్త్రం లో పాతుకుపోయిన శోధయాత్ర.... నైతిక జ్ఞానాన్ని గ్రంథస్తం చేయడం, గ్రామీణ ఆవిష్కర్తలను గౌరవించడం, పరస్పర అభ్యాసానికి ప్రాధాన్యత ఇస్తుంది. గ్రామీణ భారతదేశంలోని అడవులు, పొలాలు మరియు వర్క్‌షాప్‌లలో సృజనాత్మకత ఎలా వర్ధిల్లుతుందో కూడా ఇది విశదీకరిస్తుంది. యాత్రీకులు స్థానిక ప్రజలతో కలిసి నడిచారు, వారి ఇళ్ళలోనే బస చేశారు, నిరంతర సంభాషణలలో నిమగ్నమయ్యారు.

ఈ ప్రయాణం ఆధారంగా 53వ శోధయాత్రీకులు గ్రామాలలో అనేక నిర్దిష్ట గ్రామీణ ఆవిష్కరణలు, సాంస్కృతిక పద్ధతులు మరియు సమాజ కార్యక్రమాలను గ్రంథస్తం చేశారు. వాటిలో కొన్ని.....

- ఝాబువాకు చెందిన 'భిల్' అనే బొమ్మల (ఆదివాసీలు గుడియా అంటారు) గిరిజనుల హస్తకళ.
- అలీరాజ్‌పూర్ యొక్క గాథా స్మృతి – ఫలక్ (జ్ఞాపకార్థ స్థూపాలు).
- ఝాబువా లోని హాథీపావ్ ఘాటీలో సమాజ నేతృత్వం లో జరిగిన పర్యావరణ పునరుద్ధరణ.

ఈ ప్రయాణంలో 'గుడ్‌మార్నింగ్ క్లబ్' వంటి ఆరోగ్య



స్థానిక ప్రజల చొరవ వల్ల చెట్లతో పూర్వస్థితికి తీసుకు వచ్చిన 'ఝాబువా' జిల్లాలో గల "హాథీపావ్ ఘాటీ" అనే ప్రాంతం.

మరియు ఫిట్‌నెస్ కార్యక్రమాలు, గుణతా ప్రైమరీ పాఠశాలలో విద్య ఆధారిత పరివర్తన మరియు 'సోల్జర్ ఫిజికల్ అకాడమీ' ద్వారా యువతకు శిక్షణవంటి అంశాలను కూడా గుర్తించారు. ఇంకా గమనించిన గ్రామీణ పద్ధతులలో వెదురు ఆధారిత ఉపయోగకరమైన ఆవిష్కరణలు, అరటిపీచు ఆధారిత ఉత్పత్తులు మరియు బమానియా గ్రామంలోని "శ్రీ శివశక్తి ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ" ఆధ్వర్యంలో రైతుల నేతృత్వం లోని విలువ ఆధారిత ఉత్పత్తులు ఉన్నాయి. ఛోటా ఉదయ్‌పూర్ లో రథ్వా కళాకారులు అభ్యసించే 'పిథోరా పెయింటింగ్' సాంప్రదాయాలు, మట్టి కళల శిక్షణా కార్యక్రమాలు, బాబా దేవ్ సాంప్రదాయం లాంటి స్థానిక ఆచారాలు, సంస్కృతి మరియు జ్ఞాన వ్యవస్థల యొక్క లోతైన అనుసంధానాన్ని మరింతగా ప్రతిబింబించాయి.

## వారసత్వం మరియు జ్ఞాపకాల రూపకల్పన:

### భిల్ గిరిజన బొమ్మలు: జీవనోపాధిగా సంస్కృతి:

ఝాబువాకు చెందిన సాంప్రదాయ భిల్ గిరిజన బొమ్మలు సంస్కృతి ఆధారిత జీవనోపాధికి ఒక శక్తివంతమైన ఉదాహరణ. గుడ్డ, కలప మరియు సహజ రంగులను ఉపయోగించి చేత్తో తయారు చేయబడిన ఈ బొమ్మలు గిరిజన దుస్తులను, వారి దైనందిన జీవితాన్ని వర్ణిస్తూ, సాంస్కృతిక గుర్తింపును సజీవ రూపంలో భద్రపరుస్తాయి. 'పద్మశ్రీ' (2003) మాస్టర్ ఆర్టిజన్ రమేష్ పర్మార్ మరియు శాంతి పర్మార్ లు ఈ కళను మూడు దశాబ్దాలుగా కాపాడుకుంటూ వస్తున్నారు. వీరి కృషి సాంప్రదాయాన్ని కాపాడటమే కాకుండా, ముఖ్యంగా గిరిజన మహిళలకు జీవనోపాధి అవకాశాలను సృష్టించింది. ఈ చొరవను మరింత బలోపేతం చేస్తూ, "శక్తి ఎంపోరియం" వారసత్వాన్ని ముందుకు తీసుకు వెళ్తున్న సుభాష్ గిద్వానీ.... బొమ్మల ఉత్పత్తిని క్రమబద్ధీకరించి, 150-200 మంది మహిళా కళాకారులకు శిక్షణ ఇచ్చారు. అలాగే300 కంటే ఎక్కువ జాతీయ, అంతర్జాతీయ ప్రదర్శనలలో ఈ కళను ప్రదర్శించారు.

### గాథా స్మృతి-ఫలక్: గిరిజన చరిత్ర జ్ఞాపకార్థ స్థూపాలు:

అలీరాజ్‌పూర్‌కు చెందిన గాథా స్మృతి – ఫలక్ లేదా జ్ఞాపకార్థ స్థూపాలు, చరిత్రను నిక్షిప్తం చేసే ఒక దేశీయ వ్యవస్థను సూచిస్తాయి. రాతిపై చెక్కబడిన ఈ స్థూపాలు వ్యక్తుల జీవితాలను, వారి సహకార చిహ్నాలుగా మాత్రమే కాకుండా, యువతరాలకు విలువలు, ఆచార పద్ధతులు, సామాజిక నిబంధనలు మరియు సాంస్కృతిక సాంప్రదాయాలకు సజీవ సాక్ష్యాలుగా ఉంటాయి.

### సమాజ నేతృత్వంలో పర్యావరణ పర్యవేక్షణ: హాథీపావ్ ఘాటీ పరివర్తన:

సమాజ నేతృత్వంలో పర్యావరణ పర్యవేక్షణకు ఒక స్ఫూర్తిదాయకమైన ఉదాహరణ ఝాబువాలోని 'హాథీపావ్ ఘాటీ'లో కనిపించింది. వ్యాపారి మహాసంఘ్ మరియు స్థానిక నివాసితుల సహకారంతో కమలేష్ జీ పటేల్ దీనికి నాయకత్వం వహించారు. ఈ చొరవలో భాగంగా 5 వేలకు పైగా చెట్లునాటి, వాటిని సంరక్షించడం ద్వారా ఆ ప్రాంత పర్యావరణాన్ని పునరుద్ధరించారు. ఇది క్రమంగా ఆ ప్రాంతాన్ని పక్షులు, వన్యప్రాణులకు అనుకూలమైన ఆవాసంగా మార్చింది. నేడు హాథీపావ్ ఘాటీ ఒకపర్యావరణ అనుకూల ప్రజా ప్రదేశం గా రూపాంతరం చెందింది. సమాజ భాగస్వామ్యం మరియు దీర్ఘ కాలిక పర్యావరణ నిబద్ధత ఎలా శాశ్వతమైన పర్యావరణాన్ని ప్రభావాన్ని చూపగలదో ఇది నిరూపిస్తుంది.

## క్షేత్రస్థాయి నాయకత్వం- ప్రభావాల కథనాలు:

### మహేంద్ర & ప్రఫుల్ శర్మ - ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం:

ఝాబువాకు చెందిన శర్మ సోదరులు తమ "గుడ్ మార్నింగ్ క్లబ్" చొరవ ద్వారా 35-65 సం. మధ్య వయస్సు గల వారిలో ఆరగ్యో అవగాహనను పెంపొందిస్తున్నారు. రోగ్యకరమైన జీవన శైలి, పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా వారు ఒక సహాయక సామాజిక వాతావరణాన్ని సృష్టించారు. ఈ చొరవ మహిళా సభ్యులను కూడా శక్తివంతం చేసింది. వారిలో కొందరు జాతీయ స్థాయి వేదికలపై కూడా ప్రదర్శనలు ఇచ్చారు. సమాజ ఆధారిత ఆరోగ్య కార్యక్రమాలు నిరంతర



'అలీరాజ్‌పూర్' గిరిజన ప్రాంతంలో పూర్వీకుల కథలను, సమాజ చరిత్రను వివరించే "గాథా స్మృతి ఫలకాలు"



స్థానిక సంస్కృతి & హస్తకళలను ప్రతిబింబించే సాంప్రదాయ "భిల్ గిరిజన (ఆదివాసీ) బొమ్మలు (ఆదివాసీ గుడియా)

ప్రభావాన్ని సాధారణంగా ఎలా చూపగలవో వీరి కృషి నిరూపిస్తుంది.

**ఉదయ్ బిల్వాల్ - గ్రామీణ యువతను దేశసేవ వైపు నడిపించడం :**

రఘూబువా లోని పిప్లియాపద గ్రామానికి చెందిన ఉదయ్ బిల్వాల్ గ్రామీణ యువతను రక్షణ మరియు భద్రతా సేవల వైపు నడిపించడం కొరకు 2015 లో "సోల్జర్ ఫిజికల్ అకాడమీ'ని స్థాపించారు. ఉచిత శారీరక మరియు ప్రేరణాత్మక శిక్షణను అందించడం ద్వారా ఆయన 410 కి పైగా యువతీ యువకులు రక్షణ రంగానికి ఎంపిక అయ్యేందుకు సహాయ పడ్డారు. ఇది రఘూబువా యొక్క మొట్టమొదటి పారా కమాండోల ఆవిర్భావానికి దోహదపడింది. ఆయన చొరవ గ్రామీణ యువత ఆకాంక్షలను క్రమశిక్షణ గల కెరీర్లుగా దేశ నిర్మాణంలోకి మళ్ళిస్తుంది.

**గ్రామీణ సృజనాత్మకత యొక్క విస్తృత రూపం:**

పైన పేర్కొన్న కేస్ స్టడీస్‌తో పాటు, శోధ యాత్రీకులు తమ కార్యక్రమాల ద్వారా గ్రామీణ సృజనాత్మకత మరియు సాంస్కృతిక వ్యక్తీకరణల గొప్పతనాన్ని ఆవిష్కరించారు.

- **పాఠశాలల్లో మట్టి కళ:** ఝాబువాలోని పెట్లవాడ్‌కు చెందిన భారతి సోని వేలాది మంది పిల్లలను మట్టి కళలో నిమగ్నం చేసి, చిన్న వయస్సు నుండే సృజనాత్మకతను మరియు సాంస్కృతిక అవగాహనను పెంపొందిస్తున్నారు.
- **మహిళా సాధికారత:** ఛోటా ఉదయ్‌పూర్ లో అర్చనా రథ్వా సాంప్రదాయ కళా పద్ధతులను మహిళా సాధికారత సాధనంగా మార్చారు. తద్వారా స్థిరమైన జీవనోపాధిని నిర్మిస్తూ తన కృషికి గుర్తింపు పొందారు.
- **యంత్రాలు లేని కళ:** రతన్‌భాయ్ రథ్వా ఎలాంటి యంత్రాలను ఉపయోగించకుండా గిరిజన చరిత్రకు జీవం పోసే చెక్క బొమ్మలను తయారు చేస్తుండగా, దేసింగ్ భాయ్ రథ్వా 'పిథోరా పెయింటింగ్' సాంప్రదాయాన్ని రక్షిస్తూ యువ తరాలకు అందిస్తున్నారు.
- **వ్యవసాయ వ్యర్థాల వినియోగం :** బమానియాలోని "శ్రీ శివశక్తి ఫార్మర్స్ ప్రోడ్యూసర్ కంపెనీ" రైతులు కలసి కట్టుగా అవిసె పంట కోత పూర్తయిన తర్వాత మిగిలే వాటి



"జీతూభాయ్ పటేల్" - అతను నిర్వహిస్తున్న "గుణతా ప్రైమరీ పాఠశాల"



అతని అనుచరునితో కలిసి మతిస్థిమితం లేని వ్యక్తికి జుట్టు కత్తిరిస్తున్న 'రాజేంద్ర శ్రీవాస్తవ్,



కాండం వంటి వ్యవసాయ వ్యర్థాల నుండి విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. వీటిని వస్త్రాల తయారీ సంస్థలకు విక్రయించడం ద్వారా కొత్త ఆదాయ వనరులను సృష్టిస్తున్నారు. అదేవిధంగా సెజల్ రథ్వా – అరటి పంట చేతికి వచ్చిన తర్వాత మిగిలిపోయే కాండం (బోదె) నుండి పీచును సేకరించి, ఆ పీచును ఉపయోగ కరమైన ఉత్పత్తులు గా ఎలామార్చవచ్చో చూపించింది.

- **యువతలో ప్రతిభ:** 'గుణతా' గ్రామానికి చెందిన 'మేహుల్ రథ్వా' ఒక పాఠశాల విద్యార్థి ఒక ఆర్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించి, తన తోటి విద్యార్థులు వారిలోని ప్రతిభను అన్వేషించేలా ప్రేరేపించాడు.
- **సాంస్కృతిక ఆచారాలు & వీధి నాటకాలు:** ఛోటా ఉదయ్‌పూర్ లోని 'బాబా దేవ్' ఆచార ప్రదేశాలు దీర్ఘకాలిక నమ్మక వ్యవస్థను ప్రతిబింబిస్తాయి. అలాగే ఝాబువా జిల్లాకు చెందిన 'అనుభా భోరే' సామాజిక అవగాహన కొరకు వీధి నాటకాలను శక్తివంతమైన మాధ్యమంగా ఉపయోగించారు. కళను సామాజిక సంభాషణలతో అనుసంధానిస్తూ వందలాది ప్రదర్శనలు నిర్వహించారు.

ఈ అనుభవాలన్నీ గ్రామీణ ప్రాంతాలలో ఆవిష్కరణలు, సంస్కృతి మరియు సమాజ జీవితం ఎలా ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయో వివరిస్తాయి. ఇది శోధయాత్రకు అన్వేషణ మరియు అభ్యాస ప్రయాణానికి ఒక ప్రత్యేక లక్షణాన్ని ఇస్తుంది. ఈవిధంగా 53వ శోధయాత్ర గ్రామీణ గిరిజన సమాజాలలో ఆవిష్కరణలు, సృజనాత్మకత మరియు స్థితి స్థాపకత ఎంత లోతుగా పాతుకు పోయాయో మళ్ళీ నిరూపించింది. ప్రతి నడక ప్రజలు, ప్రకృతి మరియు స్థానిక సంస్థల మధ్య ఒక సంభాషణే.....!



గిరిజన ప్రాంతాల్లోని స్థానిక ప్రజలతో (సమాజాలతో) మమేకమై సంభాషిస్తూ యాత్రను కొనసాగిస్తున్న ప్రతినిధులు

# 'పల్లె సృజన' ఇన్నోవేటర్లకు అంతర్జాతీయ గుర్తింపు

'పల్లె సృజన' కుటుంబ సభ్యులందరికీ ఆనందాన్ని, గర్వాన్ని కలిగించే శుభవార్త తెలియజేయటం సంతోషాన్నిస్తోంది.

ఈ సంవత్సరం ప్రారంభంలో 'సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ ఫర్ ఏషియా & పసిఫిక్ (సిఐఆర్‌డిఎపి)', ఢాకా ప్రధాన కార్యాలయం నుంచి డా. వెంకట్ మల్లు గారు పల్లె సృజనను సంప్రదించారు. ఆయన స్వయంగా పల్లె సృజనను సందర్శించి, "రూరల్ డెవలప్‌మెంట్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ – 2026"లో పాల్గొనాలని ఆహ్వానించారు.

ఆ ఆహ్వానాన్ని స్వీకరించి, పల్లె సృజన తరుపున 18 మంది గ్రామీణ ఆవిష్కర్త వినూత్న ఆవిష్కరణలను ఈ అంతర్జాతీయ పోటీకి నామినేట్ చేశాము. పల్లె సృజన తన ఆవిష్కర్తలను అంతర్జాతీయ వేదికపై ప్రవేశ పెట్టడం ఇది మూడోసారి కావడం విశేషం.

ఈ విజయానికి పునాది వేసింది మన వాలంటీర్ల అంకిత భావం, నిరంతర కృషి. వారందరికీ హృదయ పూర్వక అభినందనలు.

ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి ఆవిష్కర్తకు 'సిఐఆర్‌డిఎపి పార్టిసిపేషన్ సర్టిఫికెట్'ను అందించింది. ఆ సర్టిఫెకెట్‌లను ఇక్కడ పొందుపరుస్తున్నాము. ప్రతి ఆవిష్కర్తకు వారి వ్యక్తిగత రికార్డు కోసం ఈ సర్టిఫికెట్‌ను విడి విడిగా వారికి పంపుతున్నాము.

అంతర్జాతీయ స్థాయిలో మన గ్రామీణ ఆవిష్కరణలకు గుర్తింపు లభించడం, ప్రపంచ వేదికపై మన ఆవిష్కర్తలు నిలబడడం, మనందరికీ గర్వకారణం. ఈ గౌరవం ప్రతి ఆవిష్కర్తకూ, ప్రతి పల్లె సృజన వాలంటీర్‌కు చెందుతుంది.

ఈ సందర్భంగా అందరు ఆవిష్కర్తలకు, పల్లె సృజన కుటుంబ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు.

ఈ గుర్తింపు మరిన్ని విజయాలకు నాంది కావాలని, రాబోయే అంతర్జాతీయ వేదికలపై మరింత ఉన్నతమైన విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిద్దాం. జై పల్లె సృజన!






## ఇన్నోవేషను సృజనాత్మకంగా ఉపయోగించుకుని

# శ్రమ, ఖర్చు, సమయం తగ్గించుకుంటున్న సృజనాత్మక రైతులు



రైతాంగానికి పెట్టుబడి ఖర్చులు తగ్గించడమే లక్ష్యంగా రైతుల కోసం రైతులు తయారు చేస్తున్న ఇన్నోవేషన్లు వ్యవసాయ దారులకు సమయం, శ్రమ, ఖర్చులను గణనీయంగా తగ్గిస్తూ రైతుల మన్ననలు పొందుతున్నాయి. అంతే కాదు ఇన్నోవేటర్లు వీటిని తాము ఒక దృష్టితో తయారు చేస్తే, రైతులు తెలివిగా ఆలోచించి, మరెన్నో పనులకు వినియోగించుకుంటూ ఇన్నోవేటర్లకే ఆశ్చర్యం కలిగిస్తున్న విషయం ఇటీవల వెలుగులోకి వచ్చింది. ఈ విషయాలను పాఠకులతో పంచుకుంటోంది పల్లెసృజన.

**ప్రూనింగ్ కట్టర్:** కంది పంటను పంట కాలంలో నెలకు ఒక సారి చొప్పున 3 సార్లు ప్రూనింగ్ చేసినట్లయితే దిగుబడి గణనీయంగా పెరగటంతో పాటు కంది గింజలు కూడా మంచి అవుటంతో వుండి, ఎక్కువ బరువు తూగటం జరుగుతుంది. దీన్ని ఉపయోగించున్న రైతులు కూడా ఈ విషయాన్ని ధృవీకరించారు. ప్రూనింగ్ చెయ్యకుంటే 7–8 క్వింటాళ్ళు ఎకరాకు వచ్చే దిగుబడి, ప్రూనింగ్ చెయ్యటం తో 10 క్వింటాళ్ళ వరకు వచ్చిందని, గింజలు కూడా బాగా నిండుగా ఉండటం వల్ల పప్పు రుచిగా ఉండటం, మార్కెట్లో మంచి తూకం రావటం వల్ల లాభం చేకూరిందని అన్నారు.



ఈ ప్రూనింగ్ కట్టర్ పని చెయ్యటం కోసం మళ్ళీ బ్యాటరీని ప్రత్యేకంగా కొనుగోలు చెయ్యటం అవసరం లేకుండా, దాదాపు ప్రతి రైతు ఇంట్లో ఉండే బ్యాటరీ స్ప్రేయర్‌ను ఛార్జింగ్ చేసే ప్లగ్గులో ఈ ప్రూనింగ్ కట్టర్ ప్లగ్‌ను ఉంచి పని చేసుకోవటం వల్ల దీన్ని రైతులు చాలా సంతోషంగా తీసుకుని తమ పనులు చేసుకుంటున్నారు.

కానీ, గద్వాల జిల్లాకు చెందిన 'మాణిక్యాల రెడ్డి' అనే రైతు పల్లెసృజన పత్రికలో ఈ ప్రూనింగ్ కట్టర్‌ను గురించిన సమాచారం తెలుసుకుని, తాను ఒకటి తెప్పించుకున్నాడు. కానీ వారు దీన్ని కంది పంట ప్రూనింగ్ చెయ్యటం కోసం కాదు.

వీరు గత 20 సంవత్సరాలుగా 'మునగ' పంట సాగు చేస్తూ ఉన్నాడు. కానీ ఇన్ని సంవత్సరాలుగా వీరిని బాధ పెడుతున్న అంశం మునగ కాయలను కోయడం పెద్ద సమస్యగా మారింది. అందుకు కారణం మునగ చెట్లు ఎత్తుగా పెరుగుతూ ఉండటం వల్ల పైన వున్న కాయలను కొయ్యడానికి నిచ్చెనలు వేసుకుని కోసుకోవాల్సి వచ్చేది. ఎందుకంటే మునగ చెట్టు ఎక్కటం కుదరదు కాబట్టి ఈ విషయం వారిని ఎక్కువగా బాధ పెట్టేది.

ఈ ప్రూనింగ్ కట్టర్‌ను తెప్పించుకున్న రైతు మాణిక్యాల రెడ్డి గత సంవత్సరం తన మునగ చెట్లను ఈ పరికరంతో కత్తిరించి చూశాడు. తాను ఊహించినట్లుగానే మునగ చెట్టు మనిషి చెయ్యి ఎత్తితే అందుబాటులో కాయలు ఉండేంతగా పెట్టి, పెరిగే చిగుర్లను అప్పుడప్పుడూ కత్తిరిస్తూ ఉండేవారు. ఈ విధంగా చెయ్యడం వల్ల వీరికి రెండు విధాలుగా లాభం చేకూరింది. అదేమిటంటే, మొదటిది

నిచ్చెనలు వేసుకుని కాయలు కొయ్యాల్సిన అవసరం లేకుండా కూలీలు చెయ్యి ఎత్తితే అందేంత ఎత్తులో కాయలు ఉండటం వల్ల మునగ కాయలను కోయటం సులభమైంది. ఈ విధంగా కూలీల ఖర్చు గణనీయంగా మిగిలింది. తనవద్ద ఉన్న బ్యాటరీ స్ప్రేయర్లతోనే దీన్ని పనిచేయించుకోవటం వల్ల ఎటువంటి అదనపు ఖర్చు లేకుండా పని జరిగిపోయింది.

ఇక రెండో విషయం ఏమిటంటే, మునగ చెట్టును ఇలా ప్రూనింగ్ చెయ్యటం వల్ల చెట్టు ఎదుగుదలకు ఉపయోగ పడే చెట్టు ఆహారం కాయలకు అంద టం వల్ల కాయలు బాగా దృఢంగా, నాణ్యంగా రావటం జరిగింది. ఈ విధంగా మాణిక్యాల రెడ్డి అనే రైతు ఒక ఇన్నోవేషన్‌ను తన ఆలోచనతో మరో పనికి ఉపయోగించుకుని ఎంతో లాభ పడుతున్నాడు.



**సృజనాత్మక రైతు మాణిక్యాల రెడ్డి ఫోన్ : 94410 68082**

**'స్కైతి' కొడవలి + గొడ్డలి :** 'స్కైతి' అనే పరికరాన్ని ఇన్నోవేటర్, పొలం గట్లు పిచ్చి మొక్కలతో, గడ్డితో పెరుగుతూ ఉన్నప్పుడు వాటిని సులభంగా శుభ్రం చేయవచ్చు అని, ఎత్తయిన చెట్ల అనవసరపు కొమ్మలను సులభంగా తొలగించవచ్చు అని తయారు చేశాడు. ఇదేదో బావుంది కదా అని తెప్పించుకున్నాడు తాడిపత్రికి చెందిన 'రామేశ్వర రెడ్డి' అనే రైతు. వీరు ఎక్కువగా అరటి పంట సాగు చేస్తూ ఉంటాడు. ప్రతి సంవత్సరం అరటి గెలలను కోయటానికి కూలీల ఖర్చు, శ్రమ బాగా ఎక్కు అవుతుంది అని ఈ 'స్కైతి' పరికరాన్ని ఉపయోగించు చూశాడు. దీనికి 3 అడుగుల పొడవైన పైపును



వెల్డింగ్ చేయించాడు. చెట్టుకు ఉన్న అరటి గెల వద్ద ఒక వ్యక్తి నిలబడి దాన్ని భుజంపైన ఉంచుకుంటాడు. మరో వ్యక్తి ఈ స్కైతి కొడవలితో పైన వున్న అరటి గెలను కత్తిరిస్తాడు. తర్వాత ఆ వ్యక్తి దాన్ని మోసుకు వెళ్ళి వాహనంలోకి చేరుస్తాడు.

గతంలో ఈ అరటి గెలలను కత్తిరించడానికి చాలా ఇబ్బంది పడే వాళ్ళమని, ఇప్పుడు చాలా సులభంగా అరటి గెలలు కత్తిరించే పని జరుగుతోంది. పనికూడా త్వరగా అయిపోవటంతో కూలీల ఖర్చు దాదాపు 25 శాతం తగ్గించదని అన్నాడు రైతు



**సృజనాత్మక రైతు రామేశ్వర రెడ్డి ఫోన్ : 94400 83834**

**5 కొయ్యల చేతి గొర్రు :** చిన్న కమతాలు వున్న రైతులు తమ పంట పొలాల్లో అంతర సేద్యాల కొరకు ఎద్దులను, ట్రాక్టర్లను కిరాయికి తెచ్చుకోలేరు. ఎందుకంటే అవి చిన్న కమతాలు కాబట్టి అవి తిరగటానికి కూడా కుదరదు. అందుకే ఇటువంటి రైతులు తమ పొలాలను స్వయంగా చేతితోనే అంతర కృషి చేసుకునేలా ఈ పరికరం ఎంతో ఉపయోగకరంగా ఉంది అని రైతులు కితాబు ఇస్తున్నారు.

పెద్ద రైతులు కూడా తమ పొలంలో అంతర సేద్యం చేస్తే మొక్క మొదలు వరకు వెళ్ళదు, అక్కడ మనుషులతో కలుపు తీయించడం వల్ల కూలీల ఖర్చు బాగా పెరిగి పోతుంది అని భావించి దీన్ని తీసుకుని చేత్తో చాలా సులభంగా త్వరగా పని చేసుకుంటున్నారు. అందువల్ల కూలీల ఖర్చు బాగా తగ్గి పోయిందని తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఇంట్లో వున్న పెరటి తోటల్లో ఈ పరికరం చాలా ఉపయోగకరంగా ఉంటోందని, ఇది రాకముందు చేత్తో చెట్ల చుట్టూ కూర్చుని మట్టిని గెలకాలంటే చాలా ఇబ్బంది పడేవాళ్ళ మని, చాలా మంది వయసు మీరిన వాళ్ళు తాము కూర్చుని పని చేయాల్సిన అవసరం లేకుండా నిలబడే సులభంగా పని చేసుకుంటున్నారు.

**బుష్ వీడర్ :** ఈ బుష్ వీడర్ వల్ల తమ పొలాల్లో కలుపు వేర్లతో సహా సులభంగా తీసుకో గలుగుతున్నామని, తుంగ లాంటి గడ్డిని కూడా వేర్లతో సహా తీసివేయటం జరుగుతోందని రైతులు చెబుతున్నారు. కూలీల ఖర్చు కూడా దాదాపు 25 శాతం వరకు మిగలటంతో పాటు, పొలం కూడా తీసిన గడ్డి మళ్ళీ మొలవ కుండా శుభ్రంగా ఉంటోందని రైతులు మ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

**ఈ పరికరాల కొరకు సంప్రదించండి : వీరరాఘవ రెడ్డి, ఫోన్ : 81257 99904**




పాఠశాల విద్యార్థుల్లోని సృజనాత్మక ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు హనీబీ నెట్‌వర్క్, మరియు ఎన్ఐఎఫ్ సంస్థలు సంయుక్తంగా ప్రతి సంవత్సరం "ఇగ్నైటెడ్ మైండ్ అవార్డ్స్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరచడం, వనరులను సంరక్షించడం, పర్యావరణాన్ని కాపాడడం మరియు జీవితంలో ఎదురయ్యే రోజువారి సమస్యలకు వినూత్న పరిష్కారాలను కనుగొనడం లక్ష్యంగా రూపొందించిన ఆలోచనలు, ఆవిష్కరణలను ఈ కార్యక్రమం ద్వారా గుర్తించి, సత్కరిస్తారు.

ఈ పురస్కారం భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారి స్మారకార్థం ఏర్పాటు చేయబడింది. చిన్నారుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణాత్మక ఆలోచనలను పెంపొందించాలని ఆయన ఎల్లప్పుడూ విశ్వసించేవారు.

12వ తరగతి వరకు చదువుతున్న లేదా 19 సంవత్సరాల లోపు వయస్సు గల విద్యార్థులు తమ స్వంత ఆలోచనలు, ఆవిష్కరణలను (నమూనాతో లేదా నమూనా లేకుండా) సమర్పించడం ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

2024 సంవత్సరంలో దేశంలోని 21 రాష్ట్రాల నుండి ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ విధానాల ద్వారా దాదాపు 12,000 ఆలోచనలు అందాయి. కఠినమైన పరిశీలన, మూల్యాంకన ప్రక్రియ అనంతరం ఏడు రాష్ట్రాలకు చెందిన పది అత్యుత్తమ ఆవిష్కరణలను జ్యూరీ గుర్తించి పురస్కారాల కోసం ఎంపిక చేసింది.

ఈ ఆలోచనలు చాలావరకు "సంవేదన" అనే భావాన్ని ప్రతిబింబిస్తున్నాయి. అంటే సమాజంలో ఉన్న, తరచూ గుర్తింపబడని అవసరాలను గుర్తించి, వాటికి పరిష్కారాలను వెతికే సామాజిక చైతన్యం. ఈ ఆవిష్కరణలు స్థానిక సమస్యలకు మాత్రమే కాకుండా, కొన్ని సందర్భాల్లో జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో కూడా ఉపయోగపడే పరిష్కారాలను సూచిస్తున్నాయి.

స్వావలంబనతో కూడిన, ఆవిష్కరణల ఆధారిత భారతదేశ నిర్మాణానికి చిన్న వయస్సు నుంచే సృజనాత్మకతతో పాటు సామాజిక బాధ్యతాను పెంపొందించడం ఎంతో అవసరం. ఈ పురస్కారాలు దీనికి దోహద పడతాయి. -పల్లెసృజన

"సృజనాత్మకత అంటే అందరూ చూసే విషయాన్నే చూడటం, దానిని భిన్నంగా ఆలోచించడం" – డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాం.

## 1. స్కూటీ కోసం నైట్ సేఫ్టీ స్కానర్:





**నిఖితా ఝూలరియా,** 8వ తరగతి, స్వామి ఆత్మానంద్ ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం పాఠశాల, ఛత్తీస్‌ఘడ్.

**సమస్య :** రాత్రి సమయంలో రోడ్లపై ఉన్న గుంతలు, ఎత్తు వల్లాలు స్పష్టంగా కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. తక్కువ వెలుతురులో వాహనదారులు గుంతలను ముందుగానే గుర్తించలేక ఇబ్బందులు పడుతున్నారు.

**పరిష్కారం :** 'నైట్ సేఫ్టీ స్కానర్' అనేకది ద్విచక్ర వాహనానికి అమర్చే ఒక తెలివైన భద్రతా పరికరం. ఇందులో అల్ట్రాసోనిక్ లేదా ఇన్‌ఫ్రెరెడ్ వంటి

సెన్సర్లు ఉండి, వాహనం ముందున్న రహదారిని నిరంతరం పరిశీలిస్తాయి. అకస్మాత్తుగా ఎదురయ్యే గుంతలు లేదా ఎత్తు పల్లాలను గుర్తించిన వెంటనే శబ్దం లేదా వైబ్రేషన్ రూపంలో హెచ్చరిక ఇస్తుంది. దీంతో వాహనదారులు వేగాన్ని తగ్గించడం లేదా దిశను మార్చడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చు.

### 2. ద్విచక్రవాహనాల కోసం 180 డిగ్రీలు తిరిగే సీటు కవర్:

**పృథ్వీరాజ్ రాణే,** 9వ తరగతి, రాజస్థానీ విద్యాలయ, మహారాష్ట్ర.



**సమస్య :** వేసవి కాలంలో మోటార్ సైకిల్ సీట్లు ఎక్కువగా వేడెక్కి పోతాయి. వర్షాకాలంలో అవి తడిసి అసౌకర్యాన్ని కలిగిస్తాయి.

**పరిష్కారం :** 180 డిగ్రీలు తిప్పగలిగే ఈ సీటు కవర్ ఈ సమస్యకు సులభమైన మరియు సమర్థవంతమైన పరిష్కారం. వాహన సీటు ఆకారానికి అనుగుణంగా వంగే పదార్థంతో దీన్ని తయారు చేస్తారు. దీనికి రెండు వైపులా ఉపయోగించగల ఉపరితలాలు ఉంటాయి. ఒకవైపు వేడెక్కినా లేదా తడిసినా, కవర్‌ను తిప్పి మరో చల్లని, పొడి వైపును ఉపయోగించవచ్చు. దీనివల్ల అన్ని వాతావరణ పరిస్థితుల్లో సౌకర్యవంతమైన ప్రయాణం సాధ్యమవుతుంది. ఇది అమర్చడం సులభం, ఎక్కువ శాతం మోటార్ సైకిళ్ళకు సరిపోతుంది, రోజువారీ వినియోగానికి అనుకూలంగా ఉంటుంది.



### 3. అడవి జంతువుల దాడుల నుంచి రక్షించే ప్రాణరక్షణ టార్చ్:

**క్రిన్‌బిన్ జేడన్,** 7వ తరగతి, సేక్రెడ్ హార్ట్ ఇంటర్నేషనల్ స్కూల్, తమిళనాడు.



**సమస్య :** అడవులకు సమీపంలోని గ్రామాల్లోకి అడవి జంతువులు తరచూ ప్రవేశిస్తుంటాయి. వీటివల్ల ప్రజలకు ప్రమాదం ఏర్పడటమే కాకుండా పంటలు, ఆస్తులకు కూడా నష్టం కలుగుతుంది.

**పరిష్కారం :** ఈ ప్రాణరక్షక టార్చ్ రీచార్జ్ చేసుకునే విధంగా ఉండే పోర్టబుల్ పరిక



రం. ఇది మంటల మాదిరిగా కనిపించే వెలుతురును విడుదల చేయడంతో పాటు పెద్ద శబ్దాన్ని కూడా ఉత్పత్తి చేస్తుంది. దీనివల్ల మనుషులు ఉన్నారనే భావన కలిగి అడవి జంతువులు దూరంగా వెళ్ళిపోతాయి. బాణసంచా లేదా నిప్పు వంటి సంప్రదాయ పద్ధతులతో పోలిస్తే ఇది సురక్షితమైనది. మళ్ళీ మళ్ళీ ఉపయోగించుకో వచ్చు. జంతువులకు హాని కలిగించదు. గ్రామీణ ప్రాంతాల్లో మనుషులు – అడవి జంతువుల మధ్య ఘర్షణలను తగ్గించడంలో ఇది ఉపయోగ పడుతుంది.

### 4. వికలాంగులకు అనుకూలమైన కప్పు హోల్డర్ స్టాండ్:

**ఎస్.ఎం. వెలినేషన్ కుమార్,** 12వ తరగతి, రోజావనం ఇంటర్నేషనల్ స్కూల్, తమిళనాడు.



**సమస్య :** పార్కిన్సన్స్ వ్యాధి లేదా ఇతర శారీరక వైకల్యాలు ఉన్నవారికి చేతులు వణకడం చేతి కదలికలపై నియంత్రణ తక్కువగా ఉండటం వల్ల కప్పును పట్టుకొని కాఫీ, టీ, నీళ్ళు లాంటివి తాగడం కష్టం అవుతుంది.

**పరిష్కారం :** ఈ ప్రత్యేక కప్పు హోల్డర్ స్టాండ్ కప్పును ఒకేచోట గట్టిగా నిలిపి ఉంచుతుంది. దీంతో చేతిని స్థిరంగా ఉంచాల్సిన అవసరం లేకుండా సులభంగా పానీయాలను తాగవచ్చు. దీని ఆచరణాత్మక రూపకల్పన వల్ల శరీరక కదలికలలో ఇబ్బందులు ఉన్నవారికి సౌకర్యం, భద్రత మరియు జీవన నాణ్యత మెరుగు పడుతుంది.



# పల్లె జ్ఞానం

- 'హనీబీ' ఆంగ్ల పత్రిక సౌజన్యంతో...
- వీరరాఘవ రెడ్డి

## గన్నేరు ఆకులతో పేను బంక, తెల్లదోమ నియంత్రణ:

**మహేష్ భాయ్ జయరాంభాయ్ లఖ్తారియా,** దేవిపూర్ గ్రామం, హల్వాద్ తాలూకా, సురేంద్రనగర్ జిల్లా.

పేను బంక పురుగు (అఫిడ్స్), తెల్లదోమ (వైట్‌ఫ్లై) నియంత్రణ కోసం 2 కిలోల తెల్ల గన్నేరు ఆకులను కొద్దిగా దంచి, 5–7 లీటర్ల నీటిలో 5–6 రోజుల పాటు నానబెట్టాలి. తర్వాత వడగట్టి ఆ ద్రావణాన్ని 15 లీటర్ల స్ప్రేయర్ కు 150 మి.లీ. చొప్పున కలిపి పిచికారి చెయ్యాలి. దీనివల్ల సుమారు 50శాతం వరకు నియంత్రణ సాధ్యమవుతుంది.

**సమాచారం సేకరించిన వారు :** మహేశ్ పర్మార్, మయూర్ చావా.



## పశువుల కడుపు ఉబ్బరానికి 'చెంచలాకు' మొక్కతో మందు:

**లక్ష్మీబెన్ ప్రతాప్‌జీ ఠాకర్దా,** కరణ్‌పూర్ గ్రామం, దాంతా తాలూకా, బనస్కాంతా జిల్లా.



పాడైన మేత లేదా అధిక మేత తినడం వల్ల పశువులకు కడుపు ఉబ్బరం వస్తుంది. ఇది ప్రాణాంతకంగా మారవచ్చు.



దీని నివారణకు 500 గ్రా. 'చెంచలాకు'లను తీసుకుని రోట్లో వేసి మెత్తగా నూరి, నీటిలో కలిపి పశువుకు తాగిస్తారు. దీంతో విరేచనాల ద్వారా వాయువు (గ్యాస్) బయటకు వెళ్ళి ఉపశమనం లభిస్తుంది. ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవు.

**సమాచార సేకరణ :** రామ్‌జీ దాభీ.

## టమోటా మొక్కల పెరుగుదలకు 'వాక్కాయ' పండ్లు:

**జాలా ఇంద్రజిత్ సర్దార్‌సింగ్,** బిలోద్రా గ్రామం, మంసా తాలూకా, గాంధీనగర్ జిల్లా, గుజరాత్.

టమోటా మొక్కల ఆరోగ్యం, పుష్పోత్పత్తి మెరుగు పడేందుకు 10 కిలోల వాక్కాయ పండ్లను ప్లాస్టిక్ సంచిలో వారం రోజుల పాటు నిల్వ ఉంచాలి.

తర్వాత వాటిని 60 లీటర్ల నీటిలో మరిగించి చల్లార్చి, అందులో 20 కిలోల ఆవుపేడ, 10 లీటర్ల గోమూత్రం కలపాలి. ఈ ద్రావణాన్ని 15 లీటర్ల స్ప్రేయర్‌కు 1.5 లీటర్ల చొప్పున కలిపి పంటపై పిచికారి చెయ్యాలి.

ఇది మొక్కల పెరుగుదలకు, రోగ నిరోధక శక్తిని పెంచడానికి ఉపయోగ పడుతుంది.

**సమాచార సేకరణ :** పూజాఠాకోర్, రష్మికా ఠాకోర్, ఉర్మిళా రాజ్‌పుత్.



## నేరేడు చెట్టు బెరడుతో మావి బయటకు రావడం:

**భూరాభాయ్ వశ్రంభాయ్ బోలియా,** అర్నేజ్ గ్రామం, ధోల్కా తాలూకా, హహమ్మదాబాద్ జిల్లా, గుజరాత్.



పశువుల ప్రసవం తర్వాత మావి బయటకు రాకపోతే 250 గ్రా. నేరేడు చెట్టు బెరడు పొడి 250 గ్రా. బెల్లంతో కలిపి 2 లీటర్ల నీటిలో కలిపి 2–3 రోజుల పాటు తాపిస్తారు.

పొదుగు వాపు వచ్చినప్పుడు కర్పూరాన్ని అరటి పండులో పెట్టి తినిపిస్తారు. అదనంగా వేపాకుల కషాయాన్ని పొదుగుపై పిచికారీ చేస్తారు.

గర్భాశయం బయటకు వచ్చినప్పుడు చల్లటి మంచినీటిని గర్భాశయంపై పోసి, ఉల్లిపాయ రసాన్ని రాస్తారు.

ప్రసవం తర్వాత పాల ఉత్పత్తి పెరగడానికి 50 గ్రా. చొప్పున 'నల్ల జీలకర్ర', 'హలీమ్ గింజలు' 30 రోజులపాటు తినిపిస్తారు.

**సమాచారం సేకరించినవారు :** అల్కా రావల్

### చేదు మూలికల సారం:

**సురేష్ భాయ్ భానాభాయ్ మక్వానా,** భోర్యా గ్రామం, జస్దాన్ తాలూకా, రాజ్‌కోట్ జిల్లా.

గత ఐదేళ్ళుగా సహజ వ్యవసాయం చేస్తున్నాను. టమాటా, శనగ, వేరుశనగ, కంది, బెర్రీలు మరియు కాలానుగుణ కూరగాయలు పండిస్తున్నాను. రసాయనాల బదులుగా 'మజ్జిగ, జీవామృతం, దశపర్ణి కషాయం' వంటి సంప్రదాయ పద్ధతులను ఉపయోగిస్తున్నాం.

ఇంతకుముందు చేదు మొక్కలైన 'వేప, ఉమ్మెత్త, జిల్లేడు, రేగు, మునగ, తుమ్మ' చెట్ల ఆకులు, కొమ్మలను మరిగించి పురుగు మందు తయారు చేసేవారు.

ఇప్పుడు 10 రకాల చేదు మొక్కలను తరిగి పెద్ద ప్లాస్టిక్ గొట్టంలో నింపుతారు. దీనికి '30 లీటర్ల గోమూత్రం, 250 గ్రా. ఇంగువ, 5 కిలోల పచ్చిమిర్చి, 5 లీటర్ల బెల్లం ద్రావణం 500 లీటర్ల నీరు' కలుపుతారు.

మే నెలలో తయారు చేసి జులై వరకు సహజ ప్రక్రియకు వదిలేస్తారు. 15 లీటర్ల స్ప్రేయర్‌కు 500 మి.లీ. చొప్పున పిచికారీ చేస్తే పురుగులు, రోగాలు తగ్గుతాయి.

### పాల ఉత్పత్తి పెరగటానికి చిట్కా:



దూడను వేరు చేసిన తర్వాత పశువులకు 'శతావరి వేర్లు' 100-200 గ్రా. ఖనిజ మిశ్రమంతో కలిపి తినిపిస్తారు. దీంతో ఒక్కో పశువులో 1- 1.5 లీటర్ల వరకు పాల ఉత్పత్తి పెరుగు తుంది.

### మారేడు పండ్లతో సహజ పొటాషియం:

టమాటా, వేరుశనగ పంటల్లో పొటాషియం అందించేందుకు 'మారేడు పండ్ల'తో ఎంజైమ్ తయారు చేస్తారు.

10 కిలోల మారేడు పండ్లు, 3 కిలోల బెల్లం, 20 లీటర్ల నీటిని ఒక పాత్రలో కలిపి, దానికి గాలి చొరబడకుండా మూత పెట్టాలి. మూడు నెలల తర్వాత వడకట్టి 15 లీటర్ల స్ప్రేయర్‌కు 100 మి.లీ. చొప్పున పది రోజుల వ్యవధిలో మూడు సార్లు పిచికారీ చేయ్యాలి.

ఇది రసాయన పొటాష్ ఎరువుల అవసరాన్ని గణనీయంగా తగ్గిస్తుంది.

**సమాచార సేకరణ :** అల్కా రావల్.



మారేడు పండ్లు

### సహజ వ్యవసాయ పద్ధతులు:

**భరత్‌సింగ్ భీఖాభాయ్ చౌహాన్,** లిమ్డీ మెడారి గ్రా., లిమ్డేడా తా., దాహోద్ జిల్లా.

మా పొలంలో పత్తి, మొక్కజొన్న, వరి మరియు కూరగాయలను ఎలాంటి రసాయన ఎరువులు, పురుగు మందులు ఉపయోగించకుండా సాగు చేస్తాం. నేల సారాన్ని కాపాడుకోవటానికి సమీపంలోని చెరువులు, ఆనకట్టలలో పేరుకుపోయిన ఒండ్రుమట్టిని పొలాలకు తీసుకొచ్చి వేస్తాం.

పంటల సంరక్షణ కోసం ఒక సంప్రదాయ వృక్షాధారిత కషాయాన్ని తయారు చేస్తాం. సీతాఫలం ఆకులు, ఉమ్మెత్త ఆకులు, వేప ఆకులు సమాన పరిమాణంలో తీసుకుని గోమూత్రంలో మరిగిస్తాం. ద్రావణం సగానికి తగ్గే వరకు మరిగించిన తర్వాత వడగడతాం.

ఈ కషాయాన్ని 15 లీటర్ల స్ప్రేయర్‌కు అర లీటరు ద్రావణాన్ని కలిపి ఆరు రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేస్తాం.

ఈ ద్రావణం పంటలకు హాని చేసే పురుగులు ముఖ్యంగా ఆకుతినే గొంగళి పురుగులను సమర్థవంతంగా నియంత్రిస్తుంది.

# పీపుల్స్ ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్

## 4వ ఇన్నోవేషన్ ఉత్సవాలు - కొత్త ఢిల్లీ - 2025



- 'హనీబీ' ఆంగ్ల సంచిక సౌజన్యంతో...

అనువాదం : వీరరాఘవ రెడ్డి

నేటి సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారాలు కేవలం ప్రయోగశాలల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోని సాధారణ ప్రజల ఆలోచనల్లోనూ పుడుతున్నాయి. అలాంటి సృజనాత్మకతను వెలికితీసి ప్రోత్సహించేందుకు నిర్వహించే "పీపుల్స్ ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్స్ -2025" (ప్రజల ఆవిష్కరణల మహోత్సవం - 2025) 4వ ఇన్నోవేషన్ ఉత్సవాలు 2025 నవంబర్ 17 నుంచి 20 వరకు న్యూఢిల్లీలోని 'ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్'లో ఘనంగా జరిగాయి.

ఈ కార్యక్రమాన్ని సి-క్యాంప్ (C-CAMP), బెంగుళూరు మరియు గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్స్ అగ్మెంటేషన్ నెట్‌వర్క్ (GIAN), అహ్మదాబాద్ సంయుక్తంగా నిర్వహించాయి. దేశం నలుమూలల నుంచి వచ్చిన గ్రామీణ ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలు, సాంకేతిక పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, విధాన నిర్ణేతలు ఈ మహోత్సవంలో పాల్గొన్నారు.

వ్యవసాయం, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, గ్రామీణ జీవనోపాధి వంటి రంగాల్లో ప్రజలు స్వయంగా అభివృద్ధి చేసిన వినూత్న పరిష్కారాలను ఈ వేదికపై ప్రదర్శించారు. గ్రామీణ ప్రజల అనుభవ జ్ఞానం, శాస్త్రీయ పరిజ్ఞానం కలిసినప్పుడు సమాజానికి ఎంతో ఉపయోగకరమైన పరిష్కారాలు అందించవచ్చో ఈ ఉత్సవం స్పష్టంగా చూపించింది.

ప్రత్యేకించి రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన వ్యవసాయ పరికరాలు, నీటి సంరక్షణ సాంకేతికతలు, ఆరోగ్య సంరక్షణకు తక్కువ ఖర్చుతో కూడిన పరికరాలు, పర్యావరణ హిత ఆవిష్కరణలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పుట్టిన ఆలోచనలు జాతీయ స్థాయికి చేరి సమాజ అభివృద్ధికి దోహదపడేలా చేయడమే ఈ ఉత్సవం ప్రధాన లక్ష్యం.

హనీబీ నెట్‌వర్క్ ప్రారంభించిన ప్రజా ఆవిష్కరణల ఉద్యమానికి కొనసాగింపుగా నిర్వహిస్తున్న ఈ మహోత్సవం 'ప్రతి మనిషిలో ఒక సృజనకర్త ఉన్నాడు' అనే సందేశాన్ని మరోసారి చాటి చెప్పింది. గ్రామీణ ఆవిష్కర్తలకు గుర్తింపు, ప్రోత్సాహం, వ్యాపార అవకాశాలు కల్పించడంలో 'పీపుల్స్ ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్స్-2025' కీలక వేదికగా నిలిచింది.

పల్లెసృజన ఈ సంచిక నుండి అక్కడ ప్రదర్శించబడిన కొన్ని విశిష్టమైన ఆవిష్కరణలను పాఠకులకు పరిచయం చేయబోతోంది. వాటి వివరాలు ఈ సంచిక నుండి మీకు అందిస్తున్నాము.

### ఆవు పేడతో నర్సరీ కుండీలు తయారు చేసే యంత్రం:

**గోపాల్‌భాయ్ సుర్తియా,** వడోదర, గుజరాత్.

**సమస్య:** నర్సరీలలో మొక్కలు పెంచడానికి సాధారణంగా ప్లాస్టిక్ కవర్లు లేదా సంచులను ఉపయోగిస్తారు. ఇవి నేలలో కలిసిపోవు, పర్యావరణా నికి హానికరం. మొక్కలను పొలంలో నాటేటప్పుడు ఈ సంచులను చింపి తీసివేయాల్సి రావడం వల్ల వేర్లు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. అంతే కాకుండా ప్లాస్టిక్ వ్యర్థాలు పెరిగి కాలుష్యానికి కారణమ వుతున్నాయి.

**ఆవిష్కరణ:** ఈ సమస్యకు పరిష్కారంగా గుజరాత్‌కు చెందిన గోపాల్ భాయ్ సూర్తియా ఆవు పేడతో వ్యవసాయ వ్యర్థాలను కలిపి కుండీలు తయారు చేసే పరికరాన్ని తయారు చేశాడు. మొదట ఆయన చేతితో కుండీలు తయారు చేసేవారు. తరువాత 'పరేష్‌భాయ్' అనే వ్యక్తి సహకారంతో ప్రత్యేక యంత్రాన్ని రూపొందించి, పెద్దయెత్తున ఉత్పత్తి చేసే విధానాన్ని అభివృద్ధి చేశారు.

ఈ కుండీల తయారీలో ఆవు పేడ, గోధుమ పిండి - 20:1 నిష్పత్తిలో కలిపి, గోధుమ పొట్టు వంటి వ్యవసాయ వ్యర్థాలను కలుపుతాడు. చెదపురుగుల నుంచి రక్షణ కొరకు



నజ్జపిండి, ఆముదం పిండి లేదా వేపాకుల పొడిని ఉపయోగిస్తారు.

**ప్రయోజనాలు:**

- కుండీలలో గాలి ప్రసరణ మెరుగ్గా ఉంటుంది.
- నీరు నెమ్మదిగాఇంకి మొక్కలకు ఎక్కువ కాలం తేమ అందుతుంది.
- పోషకాలు బయటకు కొట్టుకుపోవడం తగ్గుతుంది.
- మొక్కల పెరుగుదల వేగవంతం అవుతుంది.
- కుండీతో సహా నేరుగా పొలంలో నాటవచ్చు.
- వేర్లకు ఎటువంటి నష్టం జరగదు.
- ప్లాస్టిక్ వ్యర్థాలు తగ్గి వాతావరణ పరిరక్షణకు తోడ్పడు తుంది.
- గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు సృష్టిస్తుంది.

**ప్రస్తుత స్థితి :** ఈ యంత్రాలు ఇప్పటివరకు 3,500 దాకా విక్రయించ బడ్డాయి. ఈ ఆవిష్కరణకు 2017లో పేటెంట్ దరఖాస్తు (నం. 201721021475ఎ) నమోదు చేయబడింది.

ఈ వినూత్న ఆవిష్కరణను రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ కార్యక్రమంలో ప్రదర్శించారు. గోపాల్‌భాయ్‌ని 1999లో జరిగిన 3వ జాతీయ శోధయాత్ర సందర్భంగా హనీబీ నెట్ వర్క్ గుర్తించింది. ఈ శోధయాత్రకు SRISTI నాయకత్వం వహించగా GIAN మద్దతు అందింది.

**ఇన్నోవేటర్ ఫోన్ నెం. :** గోపాల్‌భాయ్ సూర్తియా, 98249 49291.

**పల్లెసృజన మాట :** ఆవుపేడ, వ్యవసాయ వ్యర్థాలు వంటి స్థానికంగా లభించే వనరులను ఉపయోగించి పర్యావరణానికి మేలు చేసే ఈ ఆవిష్కరణ, నర్సరీలలో ప్లాస్టిక్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించే సామర్థ్యాన్నికలిగి ఉంది. "వ్యర్థాన్ని వనరుగా మార్చడం" అనే భావనకు ఇది ఒక మంచి ఉదాహరణ. రైతులు, నర్సరీ నిర్వాహకులు, స్వయం ఉపాధి కోరుకునే గ్రామీణ యువతకు ఈ సాంకేతికత ఉపయోగకరంగా ఉంటుంది.

## ఒకే యంత్రంతో దుక్కి, గుంటక, లెవెలింగ్ - కాంబి టిల్లేజ్ ఎక్విప్‌మెంట్:

**మహరాజ్ సింఘ్ లోధి,** రైసెన్, మధ్యప్రదేశ్.

**సమస్య:** వ్యవసాయ భూమిని సాగుకు సిద్ధం చేయడానికి రైతులు సాధారణంగా దుక్కి దున్నడం, గుంటక వేయడం, నేలను సమతలంగా ఉండేందుకు డోజర్‌ను వాడటం వంటి పనులను వేర్వేరు పరికరాలతో చేయాల్సి ఉంటుంది. దీనివల్ల ఎక్కువ శ్రమ, అధిక ఇంధన వినియోగం, అదనపు ఖర్చులు అవుతాయి. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు అనేక యంత్రాలను కొనుగోలు చేయడం లేదా అద్దెకు తీసుకోవడం భారంగా మారుతుంది.

**ఆవిష్కరణ:** ఈ సమస్యకు పరిష్కారంగా మధ్యప్రదేశ్‌కు చెందిన మహరాజ్ సింగ్ లోధి "కాంబి టిల్లేజ్ ఎక్విప్‌మెంట్" అనే బహుళ ప్రయోజనాల ట్రాక్టర్ పరికరాన్ని అభివృద్ధి చేశాడు.

ఈ పరికరాన్ని ట్రాక్టర్‌కు అమర్చిన తర్వాత దుక్కి దున్నడం, నేలను వదులుగా చేయడం (టిల్లింగ్), లెవెలింగ్ వంటి మూడు పనులు ఒకేసారి పూర్తవుతాయి. వివిధ రకాల నేలల్లో సమర్థవంతంగా పని చేసేలా దీన్ని రూపొందించాడు.

**ప్రత్యేకతలు:**

- ఒకేసారి మూడు వ్యవసాయ పనులు పూర్తవుతాయి.
- భూమిలో గాలి ప్రసరణ మెరుగుపడుతుంది.
- ట్రాక్టర్ వినియోగ సమయం తగ్గుతుంది.
- ఇంధన వ్యయం గణనీయంగా తగ్గుతుంది.
- కార్మికుల అవసరం తగ్గుతుంది.
- సాగు పనులు వేగంగా పూర్తవుతాయి.

**రైతులకు ప్రయోజనాలు:**

ఈ పరికరం వల్ల రైతులు తక్కువ సమయంలో ఎక్కువ భూమిని సాగుకు సిద్ధం చేసుకోవచ్చు. ఇంధనం, కూలీల ఖర్చులు తగ్గడంతో సాగు వ్యయం తగ్గుతుంది. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా రైతులకు ఇది ఎంతో ఉపయోగకరమైన సాంకేతికత.



**సామాజిక ప్రభావం:**
- వ్యవసాయ వ్యయ్యాన్ని తగ్గిస్తుంది.
- భూమి సిద్ధం చేసే పనులను వేగవంతం చేస్తుంది.
- తక్కువ వనరులతో ఎక్కువ విస్తీర్ణాన్ని సాగు చేయడానికి అవకాశం కల్పిస్తుంది.
- వ్యవసాయ యాంత్రీకరణను గ్రామీణ ప్రాంతాల్లో మరింత అందుబాటులోకి తీసుకు వస్తుంది.

**ప్రస్తుత స్థితి :** ఇప్పటివరకు ఈ యంత్రం సుమారు 70 యూనిట్లు అమ్మటం జరిగింది. రైతుల నుంచి మంచి ఆదరణ ఉన్నప్పటికీ, పెట్టుబడి కొరత కారణంగా ఉత్పత్తి పరిమిత స్థాయిలోనే కొనసాగుతోంది.

ఈ ఆవిష్కరణకు ఎన్ఐఎఫ్ 2019 లో నిర్వహించిన 10వ జాతీయ ఆవిష్కరణ పురస్కారాలలో గుర్తింపు లభించింది.

**ఇన్నోవేటర్ ఫోన్:** మహారాజ్‌సింగ్ లోధి, 99933 34021

**పల్లెసృజన మాట:** ఒకే యంత్రంతో మూడు వ్యవసాయ పనులను పూర్తి చేయగల ఈ 'కాంబి టిల్లేజ్ పరికరం' రైతుల సమయం, శ్రమ, ఇంధన ఖర్చులను గణనీయంగా తగ్గించడమే కాక, భూమిపైన మూడు సార్లు ట్రాక్టరును నడపటం వల్ల భూమి పై భారం కాకుండా మూడు పనులు ఒకేసారి చేసుకోవచ్చు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పనులు చేసుకునే ఈ పరికరం చిన్న, సన్నకారు రైతులకు చాలా బాగా ఉపయోగ పడుతుంది. గ్రామీణ అవసరాలను అర్థం చేసుకుని "రైతు సమస్యకు – రైతే పరిష్కారం" అనే భావనకు చక్కటి ఉదాహరణ.

## హైబ్రిడ్ మూడు -ట్యాంకుల బయోగ్యాస్‌డైజెస్టర్ వ్యవస్థ:

**అరమేలి,** గుజరాత్.

**సమస్య:** సాంప్రదాయ బయోగ్యాస్ ప్లాంట్లు సాధారణంగా తక్కువ సామర్థ్యంతో పని చేయడమే కాకుండా, నిర్మాణ వ్యయం కూడా ఎక్కువగా ఉంటుంది. మెకానికల్ మిక్సింగ్‌కు



అధిక శక్తి అవసరం కావడం, స్లర్రీ పేరుకుపోయి వ్యవస్థ నిలిచిపోవడం, పెద్ద ట్యాంకుల నిర్మాణానికి ఎక్కువ భూమి అవసరం కావడం వంటి సమస్యలు ఉంటాయి.

అదనంగా "షార్ట్ సర్క్యూట్ డైజేషన్" కారణంగా మిథేన్ వాయువు ఉత్పత్తి తగ్గిపోతుంది. అలాగే వివిధ రకాల సేంద్రియ వ్యర్థాలను ఉపయోగించాలంటే ముందస్తు ప్రాసెసింగ్ చేయాల్సిన అవసరం ఏర్పడుతుంది.

**సాంకేతికత:**

ఈ సమస్యలకు పరిష్కారంగా అమన్ వసోయా ఒక సంక్షిప్త హైబ్రిడ్ బయోగ్యాస్ డైజెస్టర్ వ్యవస్థను అభివృద్ధి చేశారు.

ఈ వ్యవస్థలో :
- భూగర్భంలో ఎత్తు ఎక్కువగా, వ్యాసం తక్కువగా ఉండే డైజెస్టర్ ట్యాంకులు ఉపయోగించారు.
- గ్యాస్ రీ–సర్క్యులేషన్ మిక్సింగ్ సాంకేతికతను, మూసుకు పోని ప్రత్యేక నాజిల్ సహాయంతో అమలు చేశాడు.
- దీనివల్ల 1,000 లీటర్ల స్లర్రీని కేవలం 10–15 సెకన్లలో సమర్థవంతంగా కలవచ్చు.
- 15–20–50 రోజుల బహుళ దశల వాల్వుల ద్వారా నియంత్రిత జీర్ణ ప్రక్రియ ద్వారా "షార్ట్ సర్క్యూట్ డైజేషన్" ను నివారించి, మీథేన్ ఉత్పత్తిని పెంచారు.
- డైజెస్టర్‌లో సమాన ఉష్ణోగ్రత కొనసాగేందుకు 'హీటింగ్ కాయిల్'ను కూడా సమీకరిస్తున్నాఅ.

**సమాజానికి ఉపయోగాలు:**
- సేంద్రియ వ్యర్థాలను శుభ్రమైన బయోగ్యాస్‌గా మరియు పోషకాలు సమృద్ధిగా ఉన్న సేంద్రియ ఎరువుగా మారుస్తుంది.
- భూమి అవసరాన్ని, విద్యుత్ వినియోగాన్ని గణనీయంగా తగ్గిస్తుంది.
- గ్రామీణ ప్రాంతాల్లో బయోగ్యాస్ ఆధారిత చిన్న పరిశ్రమ లకు ప్రోత్సాహం అందిస్తుంది.
- బయోగ్యాస్ ప్లాంట్ల పనితీరును మరింత విశ్వసనీయంగా, సమర్థవంతంగా మారుస్తుంది.

**ప్రస్తుత స్థితి:**
- రూపొందించిన నమూనా ద్వారా వేగవంతమైన మిక్సింగ్ విజయవంతంగా నిరూపతిమైంది.
- సాంప్రదాయ విధానాలతో పోలిస్తే మీథేన్ ఉత్పత్తి 12–20 శాతం వరకు పెరిగింది.
- ఈ ఆవిష్కరణకు GETCO మరియు GIAN సంస్థలు సంయుక్తంగా అందించే రూ. 20 వేల విలువైన "టాప్ ఇడియేటర్ అవార్డు" లభించింది.
- ప్రస్తుత వాణిజ్య స్థాయి ప్రదర్శన యూనిట్‌ను అభివృద్ధి చేసే పనులు కొనసాగుతున్నాయి.

**ఇన్నోవేటర్ ఫోన్:** అమ్రేలి, ఫోన్ : 72028 45601.

# ఆయుర్వేద జ్ఞాన మథనం



ఉమా మహేశ్వర రావు

## అనేక రుగ్మతల నుండి కాపాడే 'మోదుగ పువ్వు', "మొక్కజొన్న" తో ఆరోగ్య చిట్కాలు

మనం తినే ఆహార కల్తీ వల్ల మరియు వాతావరణం వల్ల చాలా మందికి 'క్యాన్సర్, గుండె నొప్పి, రక్తపోటు (బిపి)' లాంటి రోగాలు సర్వ సాధారణంగా మారిపోయాయి. ప్రస్తుతం దాదాపు ప్రతి ఇంట్లో పైన చెప్పిన జబ్బుల్లో ఏదో ఒక వ్యాధితో బాధపడేవారు కనపడుతున్నారు. వీరు ఈ క్రింద చెప్పిన చిట్కా పాటించినట్లయితే ఆ రుగ్మతలు ఆధీనంలో ఉంటాయి, ఎక్కువ మందుల జోలికి పోకుండా రక్షణ పొందవచ్చు.

మోదుగ పువ్వు :

హోలీ పండుగ సమయంలో ఎక్కడ చూసిన 'ఎర్రటి పూల'తో కూడిన మోదుగ చెట్లు కనిపిస్తూ ఉంటాయి. వాటిని ఎవ్వరూ కోసుకుపోరు. అవే రాలి క్రింద పడుతూ ఉంటాయి. ఆ పూలను సేకరించి, ఎండబెట్టుకుని పొడి చేసి పెట్టుకుని, రోజూ ఒక చెంచాడు పొడిన నీటిలో లేదా పాలలో కలుపుకుని త్రాగుతూ ఉన్నట్లయితే పైన చెప్పిన రోగాలు లేని వారికి రాకుండా చూస్తుంది, ఆ రోగాలు ఉన్నవారికి తక్కువ మందుల తో వ్యాధి నియంత్రణలో ఉంటుంది.

మొక్కజొన్న (స్వీట్ కార్న్ కాదు – మామూలు మొక్కజొన్న) :

ప్రస్తుతం మొక్కజొన్న పంట పండించని గ్రామం దాదాపు ఉండదు. ఈ మొక్కజొన్నలో కార్బోహైడ్రేట్లు, పీచు పదార్థం విటమిన్లు చాలా ఎక్కువగా ఉంటాయి. కాబట్టి మొక్కజొన్న పాలకంకిమీద ఉన్నప్పుడు వాటిని తెచ్చుకుని ఉడక బెట్టుకుని తినటం వల్ల చాలా రోగాలు దరిచేరకుండా చేసుకోవచ్చు. లేదా వాటి గింజలను ఎండబెట్టి పొడి చేసుకుని ప్రతి ఒక చెంచాడు పొడిని నోట్లో వేసుకుని నీళ్ళు తాగుతూ ఉన్నట్లయితే కూడా మంచి ఫలితం ఉంటుంది.

కొందరి శరీరంలో ఇనుప ధాతు లోపం (ఐరన్) ఉండటం వల్ల వాళ్ళ శరీరం పాలిపోయినట్లు ఉంటూ ఉంటారు. అటువంటి వారు రోజూ ఒక మొక్కజొన్న కంకిని నీటిలో ఉడక బెట్టి తింటూ ఉన్నట్లయితే వారి శరీరానికి అవసర మైనంత ఐరన్ లభిస్తుంది.



మోదుగ పువ్వులు

ఈ మొక్కజొన్నలో మరో ప్రత్యేకత ఏమిటంటే ఇందులో నీటిలో కరిగిపోయే పీచు పదార్థం ఉంటుంది. కాబట్టి క్యాన్సర్ రోగులు ప్రతిరోజూ ఒక గ్లాసు మొక్కజొన్న గంజి తీసుకుంటూ ఉన్నట్లయితే వారి శరీరంలో ఉన్న బాధను చాలా వరకు తగ్గించుకోవచ్చు. క్యాన్సర్ లేనివారు తీసుకుంటే అసలు క్యాన్సర్ వచ్చే ప్రమాదం నుండి బయట పడవచ్చు.

మొక్కజొన్న పాల గింజలలో (కంకిపైన వెంట్రుకలు లాంటివి బాగా ఏర్పడినప్పుడు ఉండే కంకి) 'ఎ' విటమిన్ సమృద్ధిగా ఉంటుంది. కాబట్టి ఈ లేత మొక్కజొన్న కంకి ఒకదాన్ని నీటిలో బాగా ఉడికించి, రుచికి తగినంత ఉప్పు (వీలైతే సైంధవ లవణం), నిమ్మ పులుసు పిండుకుని తింటూ ఉన్నట్లయితే కంటికి మంచిది, క్యాన్సర్ రోగులకు కూడా మంచిది. ఈ గింజలను ఉడికించిన తర్వాత తినలేని వారు వాటితో కూర లేదా గంజి లాగా కూడా చేసుకుని తీసుకోవచ్చు.

కొందరికి శరీరంపైన బనియన్లు, డ్రాయర్లు వేసుకున్న వారికి శరీరంపై ఒరుసుకు పోతూ ఉంటుంది. అటువంటి వారు ఈ మొక్కజొన్న కంకిన ఉడకబెట్టిన తర్వాత ఆ నీటిని శరీరానికి రాసుకుంటే ఆ ఒరుసుకు పోయిన గాయాలు త్వరగా మానిపోతాయి.

మొక్కజొన్న కంకిని ఉడకబెట్టి, గింజలు తీసిన తర్వాత కంకులను పారవేయకుండా వాటిని ఎండబెట్టి, బూడిద చేసి, అందులో కొద్దిగా కొబ్బరినూనె కలిపి శరీరాన్ని పట్టించుకుని, ఒక గంట తర్వాత స్నానం చేస్తూ ఉన్నట్లయితే గజ్జి, తామర, చర్మ రోగాలు, ఎటువంటి చర్మరోగ రుగ్మతలైనా తగ్గిపోతాయి. అలాగే ఆ కంకి బెండును బాగా ఉడికించి, గంజి చేసుకుని లేదా కూర చేసుకుని తీసుకున్నట్లయితే క్యాన్సర్ రోగులకు చాలా వరకు బాధలను అరికడుతుంది.

●

**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం.: 9440286854

# వర్షాకాలంలో ఆరోగ్యం కోసం సాగు చేయని ఆకు కూరలు


కొమెర అంకారావు

వర్షాకాలం మొదలైంది. ఆకు కూరలు ప్రతిదీ కొని తినాల్సిన అవసరం లేకుండా ప్రకృతి మనకు ప్రసాదించే వరం "సాగు చేయని ఆకుకూరలు" పొలం గట్లమీద, ఇంటి చుట్టు ప్రక్కలా లభిస్తాయి. ఇవి మనకు ఆహారం తోపాటు వైద్యానికి కూడా పని చేస్తాయి. వాటిని తినటం వల్ల ఆరోగ్యానికి ఎలా ఉపయోగ పడతాయో తెలుసుకుందాం.

తగిరస చెట్టు :

దీన్నే కొన్ని ప్రాంతాల్లో 'తుంటెపు మొక్క', 'చక్రమర్ద' అని కూడా పిలుస్తారు. ఈ ఆకును కూరగా, పప్పులో వేసుకుని, సాంబారు, రసం కూడా తయారీలో ఉపయోగించుకోవచ్చు.

ఈ ఆకును మనం ఆహారంగా తీసుకోవటం వల్ల కడుపులో ఏర్పడే ఉదర దోషాలు, గ్యాస్, అజీర్తి, కడుపు శుభ్రపడటం, వాన పాములు, ఏలిక పాములు లాంటి వాటినన్నింటినీ ఇది తొలగిస్తుంది. దీన్ని తినటం వల్ల ఆకలి బాగా అవుతుంది. అజీర్తి సమస్య తొలగి పోతుంది. అలాగే ఈ ఆకుకూర తినటం వల్ల శరీరంలో రక్త వృద్ధి బాగా



పెరుగుతుంది, ఒంట్లో వున్న చెడు నీటిని తొలగిస్తుంది. తోటకూర, గోంగూర లాగే ఈ ఆకు కూర కూడా కళ్ళకు చాలా మంచిది.

అలాగే ఈ తగిరస ఆకుతో పాటు, నాటు మునగ ఆకు (పొలాల్లో వేసే హైబ్రిడ్ మునగాకు కాదు) లేదా అడవిలో లభించే మునగ ఆకు ఒక్కోటి ఒకటి, రెండు గుప్పెళ్ళు తీసుకుని, రోట్లో వేసి కొద్దిగా కచ్చ కచ్చగా దంచి తగినంత నీటిలో వేసి బాగా ఉడికించాలి. నీరు పూర్తిగా ఇంకిపోయే వరకు కాదు, అందులో ఇంకా కొద్దిగా నీరు ఉండగానే పొయ్యి మీదనుంచి దించి, ఈ ఆకులను నీటితో సహా ఒక కాటన్ గుడ్డలో వేసి, మూటగా కట్టి, నొప్పులు ఉన్నచోట కాపడం పెట్టినట్లయితే శరీరంలోని నొప్పులన్నీ ఒకటి రెండు గంటల్లో తగ్గిపోతాయి. ఆ తర్వాత నొప్పులు తీవ్రంగా ఉన్నచోట ఒక కాటన్ గుడ్డను చుట్టి, దానిపైన ఈ వేడి ఆకును వేసి, మళ్ళీ ఆ ఆకుపైన ఒక గుడ్డను కట్టినట్లయితే నొప్పులు త్వరగా తగ్గిపోతాయి. వేడి ఆకును నేరుగా శరీరంపైన వేస్తే వేడికి మనిషి తట్టుకోవడం కష్టం కాబట్టి గుడ్డపైన ఆకు వేసి, ఆకుపైన మళ్లీ కట్టు కట్టడం మంచిది.

ఈ చక్రమర్ద ఆకు వల్ల మరో వైద్యం కూడా చేసుకోవచ్చు. శరీరంపైన తెల్లటి లేదా నల్లటి మచ్చలు, గజ్జి, తామర ఉన్నట్లయితే ఈ ఆకును మెత్తగా నూరి, రసం తీసి, ఆ రసంలో కొద్దిగా పసుపు, కొద్దిగా కొబ్బరి నూనె వేసి బాగా కలిపి, శరీరంపైన పూసినట్లయితే పైన చెప్పిన శరీర రుగ్మతలన్నీ రెండు మూడు రోజుల్లో తగ్గిపోతాయి.

వామింటాకు :

ఇది కూడా వర్షాకాలంలో మనకు లభించే సాగు చెయ్యని ఆకుకూర. కాకపోతే ఇది కొంచెం బంక లాగా ఉంటుంది కాబట్టి ఈ ఆకును కోసుకున్న తర్వాత రెండు, మూడు సార్లు బాగా కడిగి వండుకోవాల్సి ఉంటుంది. ఈ ఆకును కూడా పై చెప్పిన విధంగానే కూర, పప్పు, చారుగా వండుకుని తినవచ్చు. ఇలా వండుకుని తినటం వల్ల తగిరస ఆకు వల్ల లభించే సమస్యల నివారణతో పాటు, అదనంగా మొలలు, మలబద్ధకం వ్యాధి ఉన్న వారికి కూడా చాలా బాగా పని చేస్తుంది. ఈ ఆకుకూర తినటం వల్ల శరీరం పైన ఉన్న మచ్చలకు కూడా నివారణగా పని చేస్తుంది.

ఈ వామింటాకు వైద్యంగా ఎలా పని చేస్తుందంటే..... దీన్ని రోట్లో వేసి కొద్దిగా దంచి, తలపైన (మాడుపైన) వేసి కట్టు కడతారు. ఇలా చేయటం వల్ల జలుబు, తుమ్ములు ఎక్కువగా ఉండి, తలలో నీరు ఎక్కువగా ఉండటం వల్ల తల భారంగా ఉన్న వాళ్ళు, అప్పుడప్పుడూ తలనొప్పి వస్తున్న వాళ్ళకు మాడుపైన ఒక ముద్దగా పెట్టి కట్టు కట్టిన ఒకటి రెండు గంటల తర్వాత ఆ ఆకు ముద్దను (పేస్టును) తీసి పిండినట్లయితే అందులో నుండి నీరు బయటకు వస్తుంది. మళ్ళీ అదే ఆకును కట్టుగా కట్టాలి. ఇలా రెండుమూడుసార్లు చేయటం వల్ల తలలో వున్న చెడు నీరు అంతా బయటకు తీసివేస్తుందీ వామింటాకు.

ఈ వామింటాకు కాయలను లోపలి విత్తనాలు తీసి, బాగా దంచి, పిండినట్లయితే రసం వస్తుంది. ఆ రసంలో కొద్దిగా పసుపు, కొబ్బరినూనె వేసి చర్మ రోగాలకు పైన పూసినట్లయితే ఎటువంటి చర్మ రోగాలైనా నయమౌతాయి.



**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

కొమెర అంకారావు (జాజి) ఫోన్ నెం.: 9908411700

'పల్లెసృజన' ప్రచురణ నవంబర్ – డిశంబర్ 2025 సంచికతో ముద్రణ ఆపివేయ బడింది. ఆ తరువాత వెలువడుతున్న రెండవ 'డిజిటల్ సంచిక' ఇదే. కాస్త ఆలస్యమైంది, క్షమార్హులం.

వందలకొద్దీ పాఠకులు ఫోన్ ద్వారా ప్రచురణ ఆపివేయడాన్ని ఒప్పుకోలేక, ప్రచురణ లేమిని మాతో పంచుకున్నారు. మా ఉద్దేశ్యంలో ఇదొక కాలానుగుణ్యమైన మార్పు. దీనివల్ల పల్లెసృజన పాఠకులు పత్రిక చదవాలంటే కొంత బాధ్యత వహించాల్సి వస్తోంది. అందరూ https://pallesrujana.org/ నుండి పత్రికను డౌన్‌లోడ్ చేసి, కనీసం 10 కాపీలు ప్రింట్ చేయండి. ఆ కాపీలను మీ మిత్ర బందంలో, దగ్గర పాఠశాలల్లో, గ్రంథాలయాల్లో పంచండి. ఈ విధంగా పల్లెసృజన సంస్థ చేపట్టిన 'పల్లెజ్ఞాన ప్రసరణ' విస్తృతం చేయడంలో మీరంతా భాగస్వాములౌతారు.

ప్రతి సంచికను సిద్ధం చేయడానికి 'పల్లెసృజన' సంపాదక వర్గం చేసే శ్రమ నిరర్థకం కాకుండా ఉండాలంటే మీరు పైన చెప్పిన సలహాలను విస్తృతంగా పాటించాలని విశ్వసిస్తున్నాము. ఇన్నాళ్ళు కలిసి నడిచాం. ఇప్పుడు ఆగవద్దు. ముందుకు అడుగు వేసి, పల్లె జ్ఞాన విస్తరణకు ఊపునిద్దాం.

మనమంతా సహచర్యంతో, సహకారంతో సమాజంలో ఒక మంచి కార్యాన్ని విజయవంతంగా చేద్దాం. పల్లెజ్ఞాన ప్రసరణలో భాగంగా తెలుగు పాఠకులంతా కలిసి పల్లెసృజన పత్రికను వేలాది మందికి చేరుద్దాం. అలా జరిగితే కలిగే ఆనందం, తృప్తి మనందరిది కదా!

– పల్లెసృజన బృందం

Palle Srujana
పల్లెసృజన

# రైతుల కొరకు రైతులు చేసిన ఇన్నోవేషన్ల సదస్సుకు ఆహ్వానం

**గ్రామ సర్పంచులకు, ప్రజా ప్రతినిధులకు,**

రైతుల కొరకు రైతులు తయారు చేసిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్ల సదస్సు 'పల్లెసృజన – క్రియేటివ్ మైండ్స్' సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు అందరూ ఆహ్వానితులే.

ఈ సదస్సులో రైతుల సమస్యలకు సరళమైన, అందుబాటులో ఉండే వ్యవసాయ యంత్ర పరికరాలు, చేతి పనిముట్లు, యంత్ర పరికరాలు, విత్తనాలు, మొక్కలు, బయో పెస్టిసైడ్స్, సేంద్రియ పురుగు మందులు, పశు మరియు మానవ ఆరోగ్యానికి చెందిన సూచనలు, మందులు లాంటి రైతులు ఆవిష్కరించిన జ్ఞానాన్ని ఈ సదస్సులో ప్రదర్శించ బడును. మీ సమస్యలు చర్చించి, పరిష్కారాలు సాధించుటకు ప్రయత్నాలు చేయబడును.

**తేది:** 02-05-2026,

**స్థలం:** పల్లెసృజన కార్యాలయం,
ప్లాట్ నెం. 77, వాయుపురి, సైనిక్ పురి పోస్ట్, సికింద్రాబాద్, తెలంగాణ.

ఇది ప్రథమ సదస్సు. రైతుల తోడ్పాటు ఆశాజనకంగా ఉంటే ప్రతి శనివారం పల్లెసృజన కార్యాలయంలో ఏర్పాటు చేస్తుంది. కొత్తగా ఎన్నికైన యువ సర్పంచులు ఈ 'జ్ఞాన ప్రసరణ' అవకాశాన్ని వినియోగించుకొని, వారి వారి గ్రామాల్లో వ్యవసాయాన్ని, చేనేతని, ఇతర జీవనోపాదులని లాభకరంగా చేస్తారని ఆశిస్తున్నాం.

ఈ సదస్సుకు రాదలచుకున్న వారు ముందుగా మీ పేరు నమోదు చేసుకో గలరు.

ఒక రోజు ముందుగా మేము మీ హాజరును నిర్ధారిస్తాము.



పూర్తి వివరాలకు సంప్రదించండి :
**సుభాష్ చందర్,**
సి.ఇ.ఓ., క్రియేటివ్ మైండ్స్,
ఫోన్ : 96528 01700

Creative Minds
Leading Innovation....

honeybee.org

Palle Srujana

పల్లెసృజన

pallesrujana.org

nifindia.org



ఆవిష్కరణ

గాలిమర ద్వారా నీరు తోడటం

ఆవిష్కర్త

**పఠాన్ సైదా**

గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్



**సమస్య:**

పొలాలకు నీరు తోడుకోవాలంటే, డీజిలు లేదా కరెంటు అవసరం తప్పనిసరి. పూర్వపు పద్ధతుల్లో మోట ద్వారా తోడుకోవాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో శ్రమ, ఖర్చుతో కూడుకున్న పని. సామాన్యరైతులక ఈ ఖర్చు పెరిగి పోవటం వల్ల పెట్టుబడి పెరిగి, రైతుకు నష్టం చేకూరుతుంది.

**ఆవిష్కరణ:**

ఎటువంటి ఇంధనం అవసరం లేకుండా గాలిమర : ఈ గాలిమరను ఒక్కసారి ఏర్పాటు చేసుకుంటే చాలు 24 గంటలూ ఎటువంటి విద్యుత్ అవసరం లేకుండా కేవలం గాలితో నీరు తోడుకోవచ్చు.

గాలి ఎటువైపు నుంచి వీచినా: గాలి ఒకే వైపు నుండి వీస్తేనే పని చేసే అవసరం లేకుండా, ఎటువైపు నుంచైనా సరే, తక్కువ గాలితో కూడా ఈ గాలిమర పని చేస్తుంది.

సామర్థ్యం: 30 అడుగుల లోతు నుండి నీటిని తోడగలదు. రోజుకు 15 వేల లీటర్ల వరకు నీటిని తోడుకోవచ్చు. సాగునీటి అవసరాలకు ఎంతో ఉపయోగకరమైనది.

నిర్వహణా ఖర్చు: దీన్ని మొదట ఏర్పాటు చేసుకోవటమే కొద్దిగా ఖర్చుతో కూడుకున్నది అంతే కాని, ఆ తర్వాత నిర్వహణా ఖర్చులు చాలా తక్కువ.

పర్యావరణ అనుకూలత: దీని ఏర్పాటు వల్ల పర్యావరణానికి ఎటువంటి నష్టం వాటిల్లదు.

**ప్రభావం:**

ఈ గాలిమర ఆధారిత నీటి పారుదల రైతుకు చాలా వరకు ఖర్చు తగ్గిస్తుంది. పర్యావరణ హితమైనది. ఇంధనం అవసరం లేదు కాబట్టి ఖర్చు ఉండదు. దీన్ని రైతాంగం ఒక్కసారి ఏర్పాటు చేసుకుంటే చాలు ఇక జీవితాంతం ఎటువంటి ఖర్చు లేకుండా నీటిపారుదల చేసుకోవచ్చు.

**Palle Srujana**

77, Vayupuri, Sainikpuri Post, Secunderabad - 500 094. Telangana
Phone : 040-49253096, 9866001678
E-mail : president@pallesrujana.org ; Visit us : www.pallesrujana.org

PALLE SRUJANA Telugu Bi-monthly March - April 2026 RNI No. TELTEL/ 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

**ఒక్కో సంచిక రూ. 30 /-లు మాత్రమే**















